సంపుటి : 9
సంచిక : 286
గురువారం
09 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
Contact For Ads:
7579339999

వెలుగులోకి యూట్యూబర్

## రావణ్ అకృత్యాలు




**విశ్వం వాయిస్ న్యూస్ :** యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ అకృత్యాలు వెలుగులోకి వస్తున్నాయి. రావణ్ ఫోన్‌లో అశ్లీల వీడియోలు బయటపడినట్టు తెలుస్తోంది. హిందూ దేవతలతో పాటు, ప్రజాప్రతినిధులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచిన అతనిపై ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. దీంతో, ఈనెల 1న పిఠాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత కాకినాడ సర్పవరం పోలీసులు అదుపులోకి

మిగతా .. 2లో..

విద్యార్థుల డైట్ ఛార్జీలు

# 10% పెంపు

- రూ.100 కోట్లతో హాస్టళ్లు, గురుకులాల మరమ్మతులు
- ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు, మెరుగైన వసతులకు సీఎం ఆదేశం
- ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సూచన
- పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని కంపెనీలకు సీఎం ఆదేశం
- కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని సూచన



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి అందించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ పెంపును వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలన్న ఆర్థిక శాఖ సూచనను సీఎం తిరస్కరించారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే పెంపు అమల్లోకి రావాలని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్య ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జీవితాల్లో మార్పు వస్తుందని, అందుకే వారికి అన్ని విధాలా మెరుగైన అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ శాఖల సమీక్షలో ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. హాస్టళ్ల స్థానంలో మరిన్ని గురుకులాలు నిర్మించాలని, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మత్తులకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి

మిగతా .. 2లో..

## నాన్నా.. మీరే నా స్ఫూర్తి

తన తండ్రి జయంతి సందర్భంగా నివాళులర్పించిన జగన్




**ఇడుపులపాయ, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైసీపీ అధినేత జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. "మీరే నా స్ఫూర్తి.. మీ ఆశీస్సులే నా ధైర్యం.. మిస్ యూ నాన్నా" అంటూ జగన్ భావోద్వేగంతో కూడిన ట్వీట్ చేశారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోలను పంచుకున్నారు. ఇడుపులపాయలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతితో పాటు పలువురు వైసీపీ సీనియర్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరుపేదల సంక్షేమం, ఉచిత విద్య, వైద్యం, ఉచిత విద్యుత్, సాగునీటి

మిగతా .. 2లో..

ఈ రాత్రికి ఇరాన్‌పై

## విరుచుకుపడతాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో ఇటీవల చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిందని ప్రకటించిన కొన్ని గంటల్లోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు రాత్రి ఇరాన్‌పై మరింత తీవ్రంగా దాడులు

మిగతా .. 2లో..

పశ్చిమాసియా

## ఉద్రిక్తతలు

ఆందోళన వ్యక్తం చేసిన భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో తాజాగా నెలకొన్న ఉద్రిక్తతలు, వాణిజ్య నౌకలే లక్ష్యంగా జరుగుతున్న దాడులపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. తాజా పరిణామాలు ఆ ప్రాంత శాంతిభద్రతలను, స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయని తెలిపింది. అన్ని పక్షాలు సంయమనం పాటించి.. ఉద్రిక్తతలను తగ్గించాలని పిలుపునిచ్చింది. పౌరుల రక్షణకు

మిగతా .. 2లో..

## ఆ ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సవాల్



**ఆళ్లగడ్డ, విశ్వం వాయిస్ న్యూస్ :** నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తెదేపా, వైకాపా నేతల సవాళ్లతో రాజకీయం వేడెక్కింది. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. అహోబిలం క్షేత్రంలో తలనీలాల అంశంపై తెదేపా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, వైకాపా మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అహోబిలం మఠంలో భూమా అఖిలప్రియ అక్రమాలకు పాల్పడుతున్నారని బ్రిజేంద్రరెడ్డి ఆరోపించారు. దీనిపై భూమా అఖిలప్రియ స్పందిస్తూ.. తాను ఎలాంటి అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. అహోబిలం మఠంలో ఉంటానని.. అక్కడికి వచ్చి తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలన్నారు. ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బ్రిజేంద్రరెడ్డికి అఖిలప్రియ సవాల్ విసిరారు. లేనిపక్షంలో బ్రిజేంద్రరెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చెప్పినట్లుగానే ఎమ్మెల్యే అహోబిలం చేరుకున్నారు. మరోవైపు ఆళ్లగడ్డ నుంచి బ్రిజేంద్రరెడ్డి అహోబిలం వెళ్లేందుకు బయల్దేరగా ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు ఆయన్ను అడ్డుకున్నారు.

మిగతా .. 2లో..

వైఎస్సార్‌కు

## మరణం లేదు

తన తండ్రి జయంతి సందర్భంగా నివాళులర్పించిన షర్మిల




**ఇడుపులపాయ, విశ్వం వాయిస్ న్యూస్ :** తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'వైఎస్సార్ లెజెండరీ లీడర్. ఆయనకు మరణం లేదు' అని షర్మిల అన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా కేవలం 5 ఏళ్లు

మిగతా .. 2లో..

## ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

నిరంజన్ మృతిపై పవన్ కల్యాణ్ భావోద్వేగం



**విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరాభిమాని, తెలంగాణలోని హనుమకొండకు చెందిన పొనుగంటి నిరంజన్ (17) అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ నిన్న రాత్రి కన్నుమూశాడు. ఈ వార్త తెలియగానే పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. సోషల్ మీడియా వేదికగా నిరంజన్‌ను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగాన్ని ఆయన వ్యక్తం చేశారు. "నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. కొద్దిరోజుల క్రితమే హనుమకొండలో వాళ్ల ఇంటికి వెళ్లి కలిసిన క్షణాలు ఇంకా నా కళ్లముందే కదలాడుతున్నాయి. అంతటి భయంకరమైన అనారోగ్యంతో పోరాడుతూ కూడా నన్ను చూడగానే ఆ చిన్నారి ముఖంలో విరిసిన చిరునవ్వు ఎప్పటికీ మరువలేని జ్ఞాపకం. శరీరం వ్యాధితో క్షీణిస్తున్నా... మనసు నిండా కొండంత ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. అంతటి ధైర్యశాలి ఇంత త్వరగా మనల్ని విడిచి వెళ్లిపోవడం జీర్ణించుకోలేకపోతున్నా. ఆ చిన్నారి చూపిన ప్రేమ నా గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది" అంటూ పవన్ భావోద్వేగానికి గురయ్యారు. గత నెలలోనే నిరంజన్ అనారోగ్యం గురించి తెలుసుకున్న పవన్ కల్యాణ్ స్వయంగా హనుమకొండ వెళ్లి

మిగతా .. 2లో..

గత పాలకుల నిర్వాకం వల్లే

## రెవెన్యూ సమస్యలు

మంత్రి అనగాని సత్యప్రసాద్




**ఉయ్యూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా ప్రభుత్వ చర్యల వల్లే ప్రస్తుతం రెవెన్యూకి సంబంధించిన సమస్యలు అధికంగా తలెత్తుతున్నాయని, పేదల హక్కులను హరించేలా గత పాలకులు దుర్మార్గంగా వ్యవహరించారని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం గండిగుంటలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా

మిగతా .. 2లో..

విద్వేషాలు రెచ్చగొట్టే అధికారం

## జగన్‌కు ఎవరిచ్చారు?

మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కోట్లాది మంది హిందువుల మనోభావాలు ముఖ్యమా.. రావణ్ వ్యాఖ్యలు ముఖ్యమో.. జగన్ చెప్పాలని మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. వెలగపూడిలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటే.. రావణ్‌కు జగన్ మద్దతిస్తానంటారా? అని నిలదీశారు. "వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం హిందూమతాన్ని తక్కువ చేసి చూపిస్తారా? పరిమితులు దాటి మత విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదు. హిందూ సమాజాన్ని కించపరచడం

మిగతా .. 2లో..

శ్రీవారి భక్తులకు సూచన..

## ఈ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సూచన. జులై నుంచి సెప్టెంబర్ మధ్య పలు తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను తితిదే రద్దు చేసింది. వివిధ పర్వదినాలు, ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకుంది. భక్తులు దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరుమల యాత్రకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులు సూచించారు. ఈ మేరకు తితిదే ఓ ప్రకటన విడుదల చేసింది. ఆయా తేదీలకు ముందురోజు తిరుమలలో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ సిఫార్సు లేఖలు స్వీకరించబోమని తెలిపింది.

**వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దయిన తేదీలు, కారణాలివే..**

జులై 14- కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, జులై 17- ఆణివార ఆస్థానం, జులై 19- శ్రీ ఆండవన్ ఆశ్రమ స్వామీజీకి

మిగతా .. 2లో..

రావణ్, ప్రకాశ్‌రాజ్‌కు వైకాపా సమర్థన..


## హిందుత్వంపై దాడే

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి



**విశ్వం వాయిస్ న్యూస్ :** మన భారతీయ సంస్కృతి అత్యంత గొప్పదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. మన దేవతలు, హిందూ మతం, దేశంపై కులమతాలకు అతీతంగా ఎవరు ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేసినా ఇటు సమాజం, అటు చట్టం తగిన బుద్ధి చెప్పాలన్నారు. యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌లను వైకాపా సమర్థించడం హిందుత్వంపై దాడేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు విజయసాయి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "రావణ్‌లు, ప్రకాశ్‌రాజ్‌లు ఎక్కడి నుంచి పుట్టుకొస్తున్నారు? వీరికి మద్దతిస్తోంది ఎవరు? వీరి మూలాలు ఎక్కడున్నాయి? తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి ఒక్కరూ దీనిపై ఆలోచన చేయాలి. బలవంతపు మత మార్పిడుల్ని సమర్థించటం.. మన సంస్కృతి, దేశ సార్వభౌమత్వంపై ఇష్టారాజ్యంగా

మిగతా .. 2లో..





## ఏ తప్పూ చేయలేదు.. వివరణ ఎందుకిస్తా?

కొండా సురేఖకు కడియం శ్రీహరి కౌంటర్



**స్టేషన్ ఘన్‌పూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ మంత్రి కొండా సురేఖను ఉద్దేశించి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. తనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌కు ఆమె లేఖ రాసిన నేపథ్యంలో కడియం స్పందించారు. "కొందరు కొత్త అలవాట్లు నేర్చుకుంటున్నారు. కాంట్రవర్సీ చేస్తూ ప్రజల మధ్య ఉండాలనుకుంటున్నారు. నేను ఏ తప్పూ చేయలేదు.. వివరణ

మిగతా .. 2లో..

రేవంత్‌రెడ్డి ఆ ఒప్పందాన్ని బయటపెడితే

## రాజీనామా చేస్తా : హరీష్‌రావు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తుమ్మిడి హట్టి పేరుతో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్లు తిన్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "తుమ్మిడి హట్టిని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర అనుమతి ఇచ్చిందని చెప్పారు. ఒకవేళ అనుమతి ఇచ్చింది

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# విద్యార్థుల డైట్ ఛార్జీలు 10 శాతం పెంపు..

పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతిభావంతులైన ఇంటర్ విద్యార్థులకు పైలట్ ప్రాజెక్టు కింద ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే సంక్షేమ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు. పొగాకు కొనుగోళ్లపై కూడా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కిలోకు రూ.200 కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని కంపెనీలను ఆదేశించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోళ్లు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టొద్దని హెచ్చరించారు. టొబాకో బోర్డు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అయితే అవసరానికి మించి పొగాకు సాగు కావడం, ఎగుమతులు తగ్గడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని అధికారులు, కంపెనీల ప్రతినిధులు సీఎంకు వివరించారు.

# వెలుగులోకి యూట్యూబర్ రావణ్ అకృత్యాలు

తీసుకున్నారు. కాకినాడ జిల్లాలో అరెస్టయిన సమయంలో ఫోన్ డేటాను విశ్లేషించిన పోలీసులు అందులో కీలక సమాచారం ఉన్నట్టు తెలుసుకున్నారు. అయితే, అప్పటికే రావణ్ తన ఫోన్‌లోని వీడియోలను డిలీట్ చేశారు. దీంతో డిలీట్ చేసిన డేటా కోసం ఫోన్ ల్యాబ్‌కు పంపించారు. తాజాగా ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి వచ్చిన నివేదికతో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అమాయక యువతులను టార్గెట్‌గా చేసుకుని వారితో అసభ్యంగా ప్రవర్తించడం, ఏకాంతంగా ఉన్న సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేసినట్టు సమాచారం. రావణ్ బాధితులు ఎంతమంది ఉన్నారనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. డేటా ఆధారంగా సుమారు 10 మంది బాధితులను గుర్తించినట్టు తెలుస్తోంది. మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసేలా, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదుతో రావణ్‌పై కృష్ణా జిల్లా గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతకు భంగం కలిగిస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారంటూ బీఎన్‌ఎస్‌లోని 152 సహా పలు సెక్షన్లు, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టంలోని (ఉపా) సెక్షన్ల కింద ఆయనపై అభియోగాలు మోపారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈనెల 18 వరకు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు

ప్రాధాన్యమివ్వాలని.. వాణిజ్యం, ఇంధన సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కోరింది. శాంతియుతమైన, శాశ్వత పరిష్కారాన్ని సాధించేందుకు తిరిగి చర్చలు ప్రారంభించాలని సూచించింది. ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లో తొమ్మిది భారత ట్యాంకర్లు చిక్కుకున్నాయని, వాటిలో 198 మంది నావికులు ఉన్నట్లు తెలిసింది. ఇవన్నీ పూర్తి స్థాయిలో ఇంధనం, గ్యాస్‌తో కూడిన నౌకలేనని వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఆ నౌకలను సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు ఇరాన్‌తో సంప్రదింపులు జరిపేందుకు ఉన్న అవకాశాలను భారత ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# గత పాలకుల నిర్వాకం వల్లే రెవెన్యూ సమస్యలు

మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలను కూటమి ప్రభుత్వం దశల వారీగా ప్రక్షాళన చేస్తోందన్నారు. ఆగస్టు నెలఖారు కల్లా ఫ్రీహోల్డ్ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని.. గుర్తించిన వాటిలో కోర్టు, కుటుంబ వివాదాలు లేని భూములను ఫ్రీహోల్డ్ నుంచి తొలగించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్‌లో స్లాట్ బుకింగ్, సేవా కేంద్రాల ఏర్పాటు, ఆటో మ్యుటేషన్ సంస్కరణల్లో భాగమేనని అన్నారు. ఉయ్యూరులో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు భూమిని విరాళంగా ఇచ్చిన సజ్జా వెంకటేశ్వరావుకు అభినందనలు తెలిపుతూ సత్కరించారు. ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నామని, అవసరమైతే మరికొన్ని నిధులు అందజేస్తామని వెల్లడించారు.

# నాన్నా.. మీరే నా స్ఫూర్తి

ప్రాజెక్టుల ద్వారా వైఎస్సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ప్రజల హృదయాల్లో నిలిచిన నేతగా రాజన్న ఎప్పటికీ స్ఫూర్తిదాయకుడని వారు స్మరించుకున్నారు.

### ఈ రాత్రికి ఇరాన్‌పై

# విరుచుకుపడతాం

చేస్తామని హెచ్చరించారు. తుర్కియేలో జరుగుతున్న నాటో సదస్సులో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇరాన్ తీరు బాగాలేదన్నారు. నేడు మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉందని చెప్పారు.

**ఎలక్ట్రిక్ గ్రిడ్‌నూ...**

గత రాత్రి అమెరికా దళాలు జరిపిన దాడుల్లో 28 ఇరాన్ నౌకలను ధ్వంసం చేశామని ట్రంప్ పేర్కొన్నారు. మరిన్ని నౌకలను నాశనం చేస్తామని.. అవసరమైతే విద్యుత్ గ్రిడ్, నీటి సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామన్నారు. అయితే, అటువంటి చర్యలు అవసరం అవుతాయని తాను భావించడం లేదన్నారు. అంతేకాదు.. ఇరాన్ చమురు ఎగుమతులకు జీవనాడిగా ఉన్న ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధిలో దిగ్బంధనాన్ని అమెరికా తిరిగి కొనసాగించే అవకాశమూ ఉందన్నారు. అయితే, అది ఇరాన్‌కు మాత్రమే వర్తిస్తుందన్నారు.

# వైఎస్సార్‌కు మరణం లేదు

మాత్రమే పని చేసినా... ఆయన చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గడపకు అందాయని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలను వైఎస్సార్ మనసు పెట్టి అమలు చేశారని తెలిపారు. ఆయన మరణాన్ని తట్టుకోలేక ఆ సమయంలో 700 మంది ఆయన వెంటే వెళ్లిపోయారని అన్నారు.

# ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

అతడిని పరామర్శించారు. ఆ సమయంలో నిరంజన్‌ను గుండెలకు హత్తుకుని, తిరుమల ప్రసాదం ఇచ్చి, సెల్ఫీ కూడా దిగారు. తనకు ఒక కుక్కపిల్ల కావాలని అడగ్గానే... ఆ రోజే కుక్కపిల్లను పంపించారు. అంతేకాదు, "నేను 'ఓజీ 2' తీస్తే అందులో నువ్వే నా స్పెషల్ గెస్ట్.. ఇద్దరం కలిసి సినిమా చూద్దాం" అని పవన్ మాట ఇచ్చారు. కానీ, ఈ లోపే చిన్నారి అనంతలోకాలకు వెళ్లిపోవడంతో ఫ్యాన్స్ ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు, బాలీవుడ్ రియల్ హీరో సోనూ సూద్ సైతం నిరంజన్ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి పరామర్శించారు. ఆ కుటుంబానికి తానున్నానంటూ కొండంత ధైర్యాన్ని అందించారు.

# జగన్‌కు ఎవరిచ్చారు?

రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. విద్వేషాలు రెచ్చగొట్టాలని జగన్, రావణ్, గొడ్డలి పార్టీకి ఎవరు అధికారమిచ్చారు. స్వేచ్ఛను ఆధారంగా చేసుకొని ఇష్టమొచ్చినట్టు మాట్లాడతామంటే ఒప్పుకొనేది లేదు. వందల ఏళ్లు పాలించిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు హిందూమతాన్ని ఏనాడూ కించపరచలేదు. మఠాధిపతులు, పూజారులను గౌరవించే సంస్కృతి మనది. మీ స్వార్థ ప్రయోజనాల కోసం హిందూమతాన్ని విచ్ఛిన్నం చేస్తారా?విద్వేషాలు రెచ్చగొట్టే అధికారం జగన్, రావణ్, గొడ్డలి పార్టీకి ఎవరిచ్చారు?" అని ప్రశ్నించారు.

# ఈ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

పెద్ద మర్యాద, జులై 29- జీయర్ స్వాముల చాతుర్మాస సంకల్పం
ఆగస్ట్ 22- పవిత్రోత్సవాలకు అంకురార్పణ
ఆగస్ట్ 24- పవిత్రోత్సవాల రెండోరోజు సందర్భంగా పవిత్రాల సమర్పణ
సెప్టెంబర్ 8- శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం
సెప్టెంబర్ 14- శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

# హిందుత్వంపై దాడే

అసభ్య పదజాలంతో దాడి చేయడం కొందరికి ఫ్యాషన్‌గా మారింది. ఆ వ్యాఖ్యల్ని సమర్థించేవారికి కూడా అదే స్థాయిలో గుణపాఠం నేర్పాలి. తెర వెనుక ఓ పథకం ప్రకారం మన దేశానికి, హిందూ మతానికి వ్యతిరేకంగా విషం కక్కించే కార్యక్రమాన్ని నడిపిస్తున్న విషయాన్ని గమనించాలి. వైకాపా నేరుగా రావణ్, ప్రకాశ్‌రాజ్‌ను సమర్థించడం హిందుత్వం, సనాతన ధర్మం, మన దేశంపై దాడే. ఇలాంటి ఆలోచనల్ని మతపరమైన ఉగ్రవాదంగా భావించాలి. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా ఇలాంటి కుట్రలపై అన్ని రకాల చర్యలు తీసుకోవాలి'' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

# ఏ తప్పూ చేయలేదు.. వివరణ ఎందుకిస్తా?

ఎందుకు ఇస్తా?దేవాదాయ శాఖ అధికారులతో నేను సమీక్ష నిర్వహించలేదు.. సమస్యలు విన్నవించా. నా వద్దకు అధికారులను పిలిస్తే అది సమీక్ష అవుతుంది. దేవాదాయశాఖపై సమీక్ష చేసే హక్కు లేదని నాకూ తెలుసు. ఆలయాల సమస్య పరిష్కారానికి ఆ శాఖ కమిషనర్‌ను కలిశా. నా నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి కోసం చర్చించా. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే సీఎంనూ కలుస్తా" అని కడియం శ్రీహరి అన్నారు. తనకు తెలియకుండా దేవాదాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారని మంత్రి కొండా సురేఖ మంగళవారం ఆరోపించారు. ఇది పరిపాలనా నిబంధనల (రూల్స్ ఆఫ్ బిజినెస్)ను ఉల్లంఘించడమే అని పేర్కొన్నారు. కడియం శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె లేఖ రాశారు. ఈ నేపథ్యంలో కడియం శ్రీహరి స్పందించారు.

# రాజీనామా చేస్తా : హరీశ్‌రావు

నిజమే అయితే.. రేవంత్‌రెడ్డి ఆ ఒప్పందాన్ని బయటపెట్టాలి. ఆ ఒప్పందాన్ని బయటపెడితే రాజీనామా చేస్తా. వ్యాప్కోస్‌ను చెఫ్‌తో పోలుస్తూ రేవంత్‌రెడ్డి మాట్లాడారు.. అసలు వ్యాప్కోస్‌ను తెచ్చిందే కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం. ఇప్పుడు ఆయన కూడా వ్యాప్కోస్‌నే ఆశ్రయించారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేయట్లేదు. నీళ్లు నింపుకొనే అవకాశం ఉన్నా ప్రభుత్వం నింపట్లేదు. వరంగల్ జిల్లాలో 90శాతం చెరువులు ఎండిపోయాయి. గురుదక్షిణ చెల్లించేందుకే రేవంత్‌రెడ్డి నీళ్లను వదులుతున్నారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం నేరపూరిత నిర్లక్ష్యం. మీ నేరపూరిత నిర్లక్ష్యానికి ఉరి తీసినా తప్పు లేదు. నిన్న రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప ఒక్క నిజం కూడా లేదు. తుమ్మిడిహట్టి నిర్మాణానికి మేం అన్ని ప్రయత్నాలు చేశాం. తుమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్టును కావాలని మార్చలేదు. అక్కడ నీటి లభ్యత తక్కువగా ఉందని కేంద్రమే లేఖ రాసింది. సీఎం రేవంత్‌రెడ్డి తీరు.. దొంగే దొంగ అన్నట్టుగా ఉంది" అని హరీశ్‌రావు విమర్శించారు.

# ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు వస్తున్న 'రాజా ది రాజా'



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యువ హీరో రుత్విక్, హీరోయిన్ విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న 'రాజా ది రాజా' చిత్రం ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరంలోని హోటల్ షెల్టన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హీరో రుత్విక్, హీరోయిన్ విశాఖ ధిమాన్, నిర్మాత కె. నిహారిక దాసరి, నటులు భద్రం, పార్వతీశం (నూకరాజు) పాల్గొని చిత్ర విశేషాలను మీడియాకు వివరించారు.ఈ సందర్భంగా చిత్రబృందం మాట్లాడుతూ, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే వినోదాత్మక కథాంశంతో పాటు యాక్షన్, భావోద్వేగాలకు ప్రాధాన్యం కల్పిస్తూ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. దర్శకుడు కథను ఆసక్తికరంగా తెరకెక్కించారని, ప్రతి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటుందని పేర్కొన్నారు. చిత్రంలోని పాటలు, నేపథ్య సంగీతం, ఛాయాగ్రహణం సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయని వెల్లడించారు.హీరో రుత్విక్ మాట్లాడుతూ ఈ సినిమా తన సినీ జీవితంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. హీరోయిన్ విశాఖ ధిమాన్ మాట్లాడుతూ, మంచి కథతో పాటు తన పాత్రకు ఉన్న ప్రాధాన్యత నచ్చి ఈ చిత్రంలో నటించినట్లు చెప్పారు. నిర్మాత కె. నిహారిక దాసరి మాట్లాడుతూ, ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమ నిర్మాణ విలువలతో సినిమాను రూపొందించామని తెలిపారు.నటులు భద్రం, పార్వతీశం మాట్లాడుతూ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రేక్షకులు సినిమాను ఆదరించాలని కోరారు. చివరగా 'రాజా ది రాజా' చిత్రం ఈ నెల జూలై 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని చిత్రబృందం ప్రకటించింది.తొలుత యాంకర్ శార్వాణి చిత్ర యూనిట్ ను ఆహ్వానించారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలి

### కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. బుధవారం ఉదయం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఉమెన్స్ కాలేజీ రోడ్డులో రూ. 14.50 లక్షలతో నిర్మించిన ఆర్.పి.సి. కల్వర్టు., గానుగవీధిలో రూ. 35 లక్షలతో నిర్మించిన సీసీ బెర్ములు., మేడూరి స్ట్రీట్ లో రూ. 9.90 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని.. ఎక్కువ కాలం నిలిచిపోయేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 4వ వార్డు రాజేంద్రనగర్లో రూ. 9.90 లక్షల అంచనాతో సీసీ రోడ్డు ప్యాచ్ వర్కులు, సీసీ కల్వర్టు నిర్మాణం., 2వ వార్డు గోపాల్ నగర్ పుంతలో రూ. 56 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం., 8వ వార్డు ప్రకాశంనగర్ రౌండ్ పార్కు ఎదురు రోడ్డులో రూ. 56 లక్షలతో సీసీ రోడ్డు మరియు సీసీ డ్రెయిన్ నిర్మాణానికి అంచనాలు రూపొందించగా.. వీలైనంత త్వరగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కమిషనర్ ఆదేశించారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పనులు జరగాలని స్పష్టం చేశారు. పర్యటనలో ఎస్ఈ రీటా, ఏఈ సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి

### సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'మన వార్డులో మన ఆదిరెడ్డి'
### 45, 46 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం
### సమస్యల పరిష్కారానికి అధికారులకు తక్షణ ఆదేశాలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపట్టాలనే ఉద్దేశంతో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చేపట్టిన 'మన వార్డులో... మన ఆదిరెడ్డి' కార్యక్రమం మంగళవారం రాత్రి 45, 46 డివిజన్ల పరిధిలోని రామదాసుపేటలో కొనసాగింది. పార్టీ కార్యకర్త ఇంట్లో బస చేసిన ఎమ్మెల్యే వాసు బుధవారం ఉదయం ప్రజలతో కలిసి డివిజన్లలో విస్తృతంగా పర్యటిస్తూ సమస్యలను స్వయంగా తెలుసుకుని అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. స్థానిక ప్రజలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓర్పుగా విని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించారు. డ్రైనేజీల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ అంతరాయాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, కాలువల శుభ్రత, పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ గృహాలు వంటి పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఆలస్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. 'మన వార్డులో... మన ఆదిరెడ్డి' కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం పట్ల స్థానికులు ఎమ్మెల్యేను అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఓటర్ల డేటా చోరీ జరుగుతోందంటూ ఎన్నికల అధికారికి బీజేపీ ఫిర్యాదు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాయవరం మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియలో ఓటర్ల వ్యక్తిగత వివరాలు థర్డ్ పార్టీ యాప్‌లలో నమోదు చేస్తున్నారంటూ భారతీయ జనతా పార్టీ నాయకులు ఎన్నికల నమోదు అధికారికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ ప్రక్రియలో ఓటర్ల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర ఎస్ఐఆర్ కన్వీనర్, అనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు, కోనసీమ జిల్లా ఎస్ఐఆర్ కన్వీనర్ తమనంపూడి రామకృష్ణారెడ్డి దిశానిర్దేశంలో, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చింతాతమ్మి రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు సమర్పించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటర్ల ఆధార్, మొబైల్ నంబర్లు వంటి వ్యక్తిగత వివరాలను ప్రైవేట్ యాప్‌లలో నమోదు చేయించడం చట్ట విరుద్ధమని ఆరోపించారు. ఈ అంశంపై గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన రాలేదని, తాజాగా సచివాలయం-2లో థర్డ్ పార్టీ యాప్‌లో డేటా నమోదు చేస్తున్న దృశ్యాలను వీడియో తీసి ఎమ్మార్వోకు చూపించినట్లు పేర్కొన్నారు. దీనిపై అధికారుల స్పందన బాధ్యతారాహిత్యంగా ఉందని విమర్శించారు. డేటా నమోదు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఒకవేళ థర్డ్ పార్టీలకు డేటా యాక్సెస్ కల్పించడం ప్రభుత్వ విధానమైతే అన్ని రాజకీయ పార్టీలకూ సమాన అవకాశం ఇవ్వాలని ఎన్నికల అధికారిని కోరినట్లు తెలిపారు. అక్రమ డేటా నమోదు జరుగుతోందని పేర్కొంటూ వీడియో ఆధారాలను పెన్‌డ్రైవ్, వాట్సాప్ ద్వారా అందజేసినట్లు వెల్లడించారు. ఈ అంశంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సిఇవో), జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు పంపినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఓటర్ల వ్యక్తిగత గోప్యతను పరిరక్షించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## ఏపీలో హిందూత్వ పోలరైజేషన్?

ఏపీ అంటేనే మొదటి నుంచి సెక్యులర్ భావాలతో ముందుకు సాగుతున్న రాష్ట్రం. దానికి నేపథ్యం కూడా గట్టిగా ఉంది. తెలంగాణాకు ఏపీకి ఇక్కడే వైవిధ్యం కూడా ఉంది. ఏపీ ఉమ్మడి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉంటూ వచ్చింది. అక్కడ ద్రవిడ భావజాలం అధికం అన్నది తెలిసిందే. దాంతో పాటు అందరూ సమానమే అన్న మరో భావన ఎక్కువగా ఉంది. ప్రశ్నించడం హేతు బద్ధంగా తర్కంగా ఆలోచనలు చేయడం వంటివి సహజంగానే ఏపీలోనూ విస్తరించాయి. జస్టిస్ పార్టీ అక్కడ పుట్టినా ఏపీలోనూ దాని భావజాలాన్ని వ్యాప్తి చేసిన వారు ఉన్నారు. ఇలా ఏపీ అయితే మొదటి నుంచి సెక్యులర్ ఐడియాలజీతోనే ముందుకు సాగింది. అదే రాజకీయాల్లో ప్రతిఫలించింది. ఉమ్మడి ఏపీగా ఉన్న చాలా కాలం పాటు వామపక్షాలు రాజకీయంగా ప్రభావం చూపించి ప్రతిపక్ష పాత్రలో ధీటుగా నిలిచిన సందర్భం ఉంది. ఒకానొక దశలో అధికారంలోకి కూడా వచ్చేంతగా వాటి ఊపు కనిపించింది.

**బీజేపీ సైతం అక్కడే :** ఏపీలో బీజేపీ ఎదగలేకపోవడానికి ఇదే ప్రధాన కారణం. జనసంఘ్ కాలం నాటి నుంచి ఎంతో మంది ఉద్ధండులు అయిన నాయకులు ఉన్నప్పటికీ ఏపీలో సొంతంగా బీజేపీ వికసించలేకపోయింది. పొత్తుల వల్లనే ఎపుడూ సీట్లు సాధిస్తూ వచ్చింది. ఏపీలో హిందూత్వ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి ఎంతగానో ప్రయత్నాలు జరిగినా అవి పెద్దగా ఫలించలేదు. ఇక ఇపుడు ఏపీలో చూస్తే మళ్ళీ అలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయా అన్న చర్చ అయితే సాగుతోంది. 2024 మధ్యలో తిరుపతి లడ్డూ కల్తీ అంటూ జరిగిన ఆందోళనలు కూడా కొంత అలజడిని రేపినా ఏపీలో మాత్రం అనుకున్న స్థాయిలో అయితే అవి ప్రతిఫలించలేదు. ఇక లేటెస్టుగా చూస్తే జరుగుతున్న కొన్ని ఉదంతాలు మళ్ళీ ఏపీలో హిందూత్వ మీద చర్చ జరిగేలా చేస్తున్నాయి.

**ఆయన అరెస్టు తోనే :** ఇటీవల ఒక యూ ట్యూబర్ ని అరెస్టు చేశారు. ఆయన మీద ఉపా కేసు ఫైల్ చేశారు. అది దేశ ద్రోహానికి పాల్పడిన వారి మీద పెట్టే కేసు. ఇక హిందూ దేవుళ్ళను ఆయన నిందించారు అని ఒక సెక్షన్ నుంచి గట్టిగా విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో వైసీపీ నేతలు కొందరు యూ ట్యూబర్ అరెస్టుని తప్పుపడుతూ విమర్శలు చేస్తున్నారు. జగన్ సైతం ట్వీట్ చేశారు. దీంతో టీడీపీ నేతలు దాని మీద గట్టిగా ప్రతి విమర్శలు చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ దేశాన్ని హిందూ మతాన్ని అవమానించిన వారిని వెనకేసుకొస్తున్నారని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర తాజాగా తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది సమంజసమేనా అని ప్రశ్నించారు.

**సాధు పరిషత్ మండిపాటు :** అదే సమయంలో హిందూ ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై ఏపీ సాధు పరిషత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీలో మతాల మధ్య చిచ్చు పెట్టాలని వైసీపీ ప్రయత్నం చేస్తోందని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. కొందరు వ్యక్తులు హిందువులపై నిరంతరం విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. హిందూ ఆరాధ్య దైవాలను అవమానించేలా మాట్లాడుతున్నారని అయితే హిందూ వ్యతిరేక శక్తులందరికీ వైసీపీ న్యాయ సహాయం చేస్తోందని ఆయన విమర్శించారు.

**నెట్టింట భీకర వార్ :** అంతే కాదు సోషల్ మీడియాలో చూస్తే యూ ట్యూబర్ అరెస్టు మీద తీవ్ర స్థాయిలో వార్ జరుగుతోంది. అనుకూల ప్రతికూల వాదనలతో నెట్టింట రచ్చ సాగుతోంది. హిందూ దేవీ దేవతల పట్ల అపచారం చేస్తున్న వారిని వెనకేసుకుని రావడమేంటి అని హిందూత్వవాదులు గట్టిగానే స్వరం పెంచుతున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉంది. బీజేపీ నేతలు అయితే దీని మీద పెద్దగా రియాక్ట్ కావడం లేదు కానీ వైసీపీని ఈ విషయంలో మిగిలిన ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నారు. వారి విషయం అలా ఉంటే ఏపీలో హిందూత్వ వాదం పెరుగుతోందా అంటే నెట్టింట జోరు అలాగే కనిపిస్తోంది. ఒక వైపు ఏపీలో బహుజన వర్గీయుల సభలు సంఘీభావ కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. మరో వైపు చూస్తే వరస ఉదంతాలతో హిందూత్వ వాదాన్ని పెంచేందుకు అనుకూల వ్యక్తులు శక్తులు ప్రయత్నం చేస్తున్న నేపథ్యం ఉంది. అయితే ఇది ఎంతవరకూ సాగుతాయన్నది ఒక ప్రశ్న. ఎందుకంటే ముందే చెప్పుకున్నట్లుగా ఏపీ అయితే ఒక న్యూట్రల్ స్టాండ్ తోనే ఉంటోంది అన్నది చరిత్ర చెబుతోంది. అదే సమయంలో గతం కంటే పెరిగిన హిందూత్వ చైతన్యం పోలరైజ్ అయ్యే విధంగా సాగుతుందా అన్నదే చర్చగా ఉంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణ హత్య



**కదిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో దారుణ హత్య జరిగింది. ముదిగుబ్బ మండలం ఈదులపల్లికి చెందిన గంగరాజు తన భార్య సునీత (32)ను ఆసుపత్రి ఆవరణలో గొంతు కోసి హత్య చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. దంపతుల మధ్య జరిగిన గొడవలో గంగరాజు తన భార్యను చితకబాదాడు. గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్దామని భార్యకు నచ్చచెప్పిన గంగరాజు మహిళా వార్డు నుంచి బయటికి తీసుకొచ్చి తన వద్ద ఉన్న కత్తితో గొంతు కోసం హత్య చేశాడు. విషయం తెలుసుకున్న కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి తన సిబ్బందితో ఆసుపత్రికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## భార్య కళ్లెదుటే ప్రియురాలితో కలిసి భర్త ఆత్మహత్యాయత్నం

### కోయంబత్తూరు నుంచి ఇద్దరినీ రైలులో తీసుకొస్తుండగా ఘటన



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రైలు ప్రయాణంలో భార్య ఎదుటే భర్త అతడి ప్రియురాలు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని శ్రీకాకుళం జిల్లా ఛత్రా గ్రామానికి చెందిన శిరీశ్‌కుమార్(34), సులోచన దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. శిరీశ్ ఆటో నడుపుతాడు. ఇతడికి ఛత్రా గ్రామంలోనే ఓ వివాహిత(34)తో పరిచయం ఏర్పడింది. భర్త అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆ వివాహిత పిల్లలతో కలిసి హైదరాబాద్ మూసాపేటలోని సోదరి ఇంట్లో నివాసముంటోంది. తరచూ ఈమెను కలిసేందుకు శిరీశ్‌కుమార్ శ్రీకాకుళం నుంచి మూసాపేటకు వచ్చి పోతుండేవాడు. ఈ క్రమంలో నెలరోజుల కిందట వీరిద్దరూ మాయమయ్యారు. తన భర్త ప్రియురాలితో వెళ్లిపోయినట్లు నిర్ధారించుకున్న సులోచన.. కోయంబత్తూరులో వీరు నివాసముంటున్నారని తెలుసుకుని బంధువులతో కలిసి అక్కడకు వెళ్లారు. ఇద్దరినీ గుర్తించి వారిని తీసుకుని సోమవారం మధ్యాహ్నం శబరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌కు బయలుదేరారు. మంగళవారం ఉదయం 11 గంటలకు రైలు చర్లపల్లి సమీపంలోకి రాగానే శిరీశ్‌కుమార్, అతడి ప్రియురాలు బాత్‌రూంకు వెళ్లి గడ్డి మందు ద్రావణాన్ని తాగారు. వెంటనే సులోచన తోటి ప్రయాణికుల సహాయంతో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారమందించగా..అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరినీ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితీ విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## ఉద్యోగం కోసం కన్నతల్లి హత్య

**జైపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** తండ్రి మరణానంతరం ప్రభుత్వం ఇచ్చే కారుణ్య నియామక ఉద్యోగాన్ని తల్లి తీసేసుకుందనే కక్షతో పాటు ఆస్తి మొత్తం తనకే దక్కాలన్న దుర్బుద్ధితో ఒక యువతి అత్యంత దారుణానికి పాల్పడింది. కన్నతల్లి హత్యకు కుట్రపన్ని దాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి పోలీసులకు దొరికిపోయింది. రాజస్థాన్‌లోని ప్రతాప్‌నగర్‌లో ఈ నెల 23న రవీంద్రనగర్‌కు చెందిన నీరజ్ శర్మ(45) కారు ఢీకొనడంతో మృతి చెందారు. ప్రమాదంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె సోదరుడు రాకేశ్ ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం భర్త మరణించగా...కారుణ్య నియామకం కింద కోర్టులో ఎల్‌డీసీగా నీరజ్ శర్మ ఉద్యోగం పొందారు. ఆ ఉద్యోగం తనకు దక్కాలని కుమార్తె ఆయుషి ఆశించింది. తల్లి ఒప్పుకోకపోవడంతో ఆగ్రహించింది. దీంతో పాటు కుటుంబ ఆస్తిని కూడా దక్కించుకునేందుకు తమ సమీప బంధువులు ఆరుగురితో కలిసి కుట్రపన్నింది. దర్యాప్తులో కుట్రను ఛేదించిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారని డీసీపీ రంజిత్ శర్మ వెల్లడించారు.

భోజనంలో నిద్రమాత్రలు కలిపి..

## దిండుతో ఊపిరాడకుండా చేసి..

### వివాహేతర బంధంతో భర్తను చంపేసిన భార్య

### హైదరాబాద్‌లో హత్య.. మహారాష్ట్రలో మృతదేహం దహనం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హతమార్చిందో భార్య. భోజనంలో నిద్ర మాత్రలు కలిపి.. దిండుతో ఊపిరాడకుండా చేసి చంపేసింది. అనంతరం కారులో మృతదేహాన్ని మహారాష్ట్రలోని తుల్జాపూర్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దహనం చేసింది. తిరిగొచ్చాక భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు ఇచ్చింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. దాదాపు 8 నెలల తర్వాత భార్య బండారాన్ని బయటపెట్టారు. హైదరాబాద్‌లోని మియాపూర్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన మల్లాని పెంటేశ్(52)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మియాపూర్‌లో సొంత అపార్టుమెంట్లు ఉండగా, అద్దెకు ఇస్తుంటారు. విభేదాల కారణంగా పదేళ్ల క్రితం భార్యతో విడిపోయి, ఒంటరిగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన సత్యవతి(40), పెంటేశ్ నిర్మిస్తున్న ఓ భవనంలో పనికోసం చేరింది. ఒంటరిగా ఉంటున్న పెంటేశ్ ఇంట్లో పనులు చేస్తూ దగ్గరైంది. వీరు కొన్నాళ్ల తర్వాత వివాహం చేసుకున్నారు. అప్పటికే సత్యవతికి వివాహమైన విషయం దాచింది. వీరు ఉండే అపార్టుమెంట్‌లోనే నిజామాబాద్ చెందిన మధుసూదన్‌రెడ్డి(38) అద్దెకు ఉంటున్నాడు. కొద్దిరోజుల తర్వాత సత్యవతికి, మధుసూదన్‌రెడ్డితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం పెంటేశ్‌కు తెలియడంతో మధుసూదన్‌రెడ్డిని ఇల్లు ఖాళీ చేయించాడు. విభేదాలు మరింత పెరగడంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని సత్యవతి పథకం వేసింది. అందుకు మధుసూదన్‌రెడ్డి సరేనన్నాడు. గతేడాది నవంబరు 19న పెంటేశ్‌కు నిద్రమాత్రల పొడి కలిపిన భోజనం పెట్టింది. తిని స్పృహ తప్పిన తర్వాత మధుసూదన్‌రెడ్డితో కలిసి దిండుతో పెంటేశ్‌కు ఊపిరాడకుండా చేశారు. చనిపోయాక వీరిద్దరూ మృతదేహాన్ని కారులో మహారాష్ట్ర తీసుకెళ్లారు. తుల్జాపూర్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో దహనం చేసి తిరిగొచ్చారు. మృతదేహం పాక్షికంగా కాలడంతో మహారాష్ట్ర పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

**భర్త కనిపించడం లేదని ఫిర్యాదు**

తన భర్త కనిపించడం లేదంటూ గతేడాది నవంబరు 19న మియాపూర్ ఠాణాలో సత్యవతి ఫిర్యాదు చేయగా.. అదృశ్యం కేసు నమోదైంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బేగంపేట నుంచి పెంటేశ్ చివరిసారి ఫోన్ మాట్లాడినట్లు పోలీసులకు చెప్పింది. అంతకుముందే పెంటేశ్ ఫోన్‌ను తీసుకెళ్లి బేగంపేట పరిసరాల్లో స్విచాఫ్ చేసి పారేశారు. పోలీసులకు పెంటేశ్ ఆచూకీ చిక్కలేదు. తదనంతర కాలంలో సత్యవతి ఎక్కువ సమయం ఫోన్‌లో మాట్లాడటం.. తరచూ హోటళ్లు, ఇతర ప్రాంతాలకు వెళ్తుండటంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిద్దరినీ పోలీసులు విచారించగా హత్యోదంతం బయటపడింది. దీంతో సత్యవతి, మధుసూదన్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు.




# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




గురువారం, 09 జూలై, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బద్ధత  www.viswamvoice.com


మై టీడీపీ యాప్ ద్వారా సర్ ప్రక్రియను

# యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

## నాయకులకు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల దిశానిర్దేశం

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డులు, గ్రామాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం నియోజకవర్గ ముఖ్య నాయకులు, గ్రామ మరియు వార్డు ఇన్‌ఛార్జ్ లతో ఆయన అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ' మొబైల్ అప్లికేషన్ ద్వారా జరుగుతున్న డిజిటల్ వెరిఫికేషన్ పురోగతిపై బూత్ ల వారీగా సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జరుగుతున్న ఈ ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియలో సాంకేతికతను జోడించి, పార్టీ రూపొందించిన 'మై టీడీపీ' యాప్ ద్వారా ప్రతీ బూత్‌లోనూ పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు వార్డు ఇన్‌ఛార్జ్ లు అందరూ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను 'మై టీడీపీ' యాప్ వేదికగా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వలస వెళ్లిన, చనిపోయిన ఓటర్ల వివరాలను త్వరితగతిన డిజిటలైజ్ చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలు ఇన్‌ఛార్జ్ లు స్వయంగా క్షేత్రస్థాయిలో ప్రతీ ఇంటినీ సందర్శించి ఓటర్ల వివరాలను మై టీడీపీ యాప్ లో నమోదు చెయ్యాలన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు జాబితా నుండి తొలగించబడకుండా జాగ్రత్త వహించాలన్నారు. యాప్ వినియోగంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే వెంటనే కాల్ సెంటర్ నెం.8886629888 ను సంప్రదించి రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత



రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఓటర్ల జాబితా సవరణపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. విపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నప్పటికీ, లక్ష్యం పారదర్శకమైన, నిజమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడమేనని నాయకులకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత గడువు ముగిసేలోగా వంద శాతం ఈ ప్రక్రియను పూర్తి చేసి మండపేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపాలని వేగుళ్ళ జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వార్డు, గ్రామ ఇన్ ఛార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను 100% పూర్తి చేయాలి : ఆర్ఓ రాజేశ్వరావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో మిగిలి పోయిన ఓట్ల వివరాలను వెంటనే పూర్తి చేయాలని మండపేట నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తంగెళ్ల రాజేశ్వరావు అధికారులను ఆదేశించారు. బుధ వారం మండపేట పురపాలక సంఘ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి మండపేట అర్బన్ ఏ ఇ ఆర్ ఓ, మునిసిపల్ కమీషనర్ టి.వి. రంగారావు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు హాజరయ్యారు. ఇప్పటివరకు సేకరించిన ఓట్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపిన ఆర్ ఓ సర్ ప్రక్రియ ముగియడానికి ఇంకా 6 రోజులే ఉందని గుర్తుచేశారు. డిజిటలైజ్ కాని ఓట్లను క్షేత్రస్థాయిలో నూటికి నూరు శాతం పరిశీలించి గుర్తించాలని సూచించారు. బి ఎల్ ఓ లు సూపర్ వైజర్లు దొరకని ఓటర్లు, మరణించిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. రాజకీయ పార్టీల బి ఎల్ ఏ ల సమన్వయంతో ఓట్ల నమోదు పనిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, వైసిపి ఐటీ వింగ్ చైర్మన్ యారమటి వెంకన్న బాబు, బిజెపి నాయకులు కోటిపల్లి సాయి రామ్, నాళం పణి ప్రకాష్, మద్దల సుబ్బారావు, కాంగ్రెస్ నాయకులు శివకోటి శేష సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు జొన్నపల్లి వెంకట్రావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మెహర్ బాబా, మునిసిపల్ డి ఈ శ్రీనివాస్ మేనేజర్ శ్రీనివాస్ స్వర్ణ వార్డు మేనేజర్ దంటు శ్రీనివాస్ ఆర్ ఓ మాచిరాజు రవి ఆర్ ఐ కొత్తపల్లి సత్తిబాబు శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు టౌన్ ప్లానింగ్ అధికారి రమ్యశ్రీ ఏఇలు దాసరి పవన్ అనూష లక్ష్మీ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులకు ఓటు విలువ, ఎన్నికల ప్రక్రియపై అవగాహన

### ఎంపీఎస్ స్కూల్లో అసెంబ్లీ ఎన్నికల తరహాలో పోలింగ్




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** చిన్నతనం నుంచే విద్యా ం ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు విలువ, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పిం చాలనే లక్ష్యంతో మండపేటలోని ఎంపీఎస్ పాఠశాలలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఓటరు జాబితా, బ్యాలెట్ విధానం, ఓటింగ్ ప్రక్రియను అనుసరిస్తూ విద్యార్థులతో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. విద్యార్థులే తమ నాయకులను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, చింతా సోమిరెడ్డి లు మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్య విలువలను అలవర్చడం ఎంతో అవసరమన్నారు. ఇటువంటి వినూత్న కార్యక్రమాల ద్వారా పిల్లల్లో బాధ్యతాయుతమైన పౌరసత్వ భావన పెంపొందుతుందని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆచరణాత్మక అవగాహన కల్పించడంలో ఎంపీఎస్ పాఠశాల నిర్వాహకులు తీసుకున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటించారు. స్కూల్ హెడ్ బాయ్ గా కె నాగ అభినవ్, హెడ్ గర్ల్ గా పి నందిని, డిప్యూటీ హెడ్ బాయ్ గా ఎస్. ఆదిత్య, డిప్యూటీ హెడ్ గర్ల్ గా కె జ్యోత్స్న, హౌస్ కెప్టెన్స్ గా ఎస్ నిఖిల్, కే జనార్దన్, బి సాత్విక్ పాల్, వి అఖిలేష్, హౌస్ వైస్ కెప్టెన్స్ గా కే ఈశ్వర్, ఎం లాశ్విన్ రాయ్, పి హర్షిత, డి పద్మ ప్రియలు ఎన్నికవ్వగా వీరికి ఎంఈవో లు బ్యాడ్జి లు అందజేశారు. విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మిమ్మల్ని గెలిపించిన విద్యార్థులకు మీరు ఏం చేస్తారంటూ విజేతలను ఎంఈవో సరదాగా ప్రశ్నించారు. అందుకు వారు విద్యార్థులకు ఏ సమస్యలు వచ్చినా పరిష్కరిస్తామని, మౌలిక వసతులు అవసరం అయితే యాజమాన్యంతో మాట్లాడుతామని సమాధానం ఇవ్వడంతో వారిని ఎంఈవో అభినందించారు. చిన్నప్పటి నుండి ఇలాంటి తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు సామాజిక బాధ్యతలను కూడా విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఓ లు కొప్పాక హేమాంబిక, మానేపల్లి కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

వెంటూరులో ఘనంగా వైఎస్సార్

## 77వ జయంతి వేడుకలు

**వృద్ధులకు పండ్ల పంపిణీ**

**వైఎస్సార్ ఆశయాలను కొనసాగించాలని పిలుపు**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 77వ జయంతి పురస్కరించుకొని రాయవరం మండలం వెంటూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం గ్రామంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి రాధాకృష్ణ, వాసంశెట్టి లోవరాజు, వాసంశెట్టి వెంకటరావు, మోర్తా ప్రసాద్, గుబ్బల సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి విజయకుమార్, చాపల అబ్బన్నతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ సంఘం

## క్రీడాకారుల కమిటీకి నామినేషన్ల ఆహ్వానం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్ర కబడ్డీ సంఘం, జాతీయ క్రీడా పరిపాలన చట్టం, 2025లోని నిబంధనలకు అనుగుణంగా, సంఘం యొక్క క్రీడాకారుల కమిటీని ఏర్పాటు చేయడం కోసం తూర్పుగోదావరి జిల్లా చెందిన అర్హులైన కబడ్డీ క్రీడాకారుల నుండి నామినేషన్లను ఇందుమూలంగా ఆహ్వానిస్తోందని తూర్పు గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బురిడి త్రిమూర్తులు తెలిపారు. 2025 కింద రూపొందించబడిన పాలనా వ్యవస్థలో ఒక అంతర్భాగంగా, అన్ని జాతీయ క్రీడా సమాఖ్యలు మరియు వాటి అనుబంధ రాష్ట్ర క్రీడా సంఘాలు తప్పనిసరిగా ఒక క్రీడాకారుల కమిటీని ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం ఆదేశించిందన్నారు. క్రీడా పరిపాలన, నిర్ణయ ప్రక్రియలలో క్రీడాకారులకు అర్థవంతమైన ప్రాతినిధ్యం కల్పించడమే ఈ కమిటీ యొక్క ఉద్దేశ్యమన్నారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ వారి ఆదేనుశారం తూర్పు గోదావరి జిల్లా కబడ్డీ క్రీడాకారుల కమిటీ ఏర్పాటు చేయుటకు అర్హులైన సీనియర్ అంతర్జాతీయ కబడ్డీ చాంపియన్ షిప్లో పాల్గొన్న సీనియర్ అంతర్జాతీయ కబడ్డీ ఛాంపియన్షిప్ప / లేదా సీనియర్ జాతీయ కబడ్డీ ఛాంపియన్షిప్లలో (పురుషులు ఒ మహిళలు) పాల్గొనేవారిగా లేదా పతక విజేతలుగా భారతదేశం లేదా ఆంధ్రప్రదేశ్కు ప్రాతినిధ్యం వహించిన, చెందిన అత్యుత్తమ ప్రతిభ గల క్రీడాకారుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయన్నారు. అర్హులై సీనియర్ క్రీడాకారులు తమ దరఖాస్తులను, స్వీయ-ధృవీకరించిన సర్టిఫికెట్ల కాపీలు, ఇతర సహాయక పత్రాలతో పాటుగా జూలై 20 లోపు తప్పనిసరిగా ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీకి సమర్పించవలసిందిగా తెలిపారు.

థెరిస్సా సెంటర్ నందు

## ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం మదర్ థెరిస్సా సెంటర్ నందు వాలంటరీ వింగ్ స్టేట్ సెక్రటరీ పెదపాటి రమేష్ (డాక్టర్ బాబు) అధ్యక్షతన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి డాక్టర్ బాబు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ నేపథ్యంలోనే భారీ కేకును కట్ చేసి పలువురు వైసీపీ కార్యకర్తలకు అభిమానులకు పంచారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కోరుకొండ మండలంలో ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో 131వ సారి రక్తదానం చేసినట్లుగా డాక్టర్ బాబు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పెదపాటి రమేష్ మాట్లాడుతూ ఈరోజు జూలై 8న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు, వైఎస్సా ర్సీపీ శ్రేణులు ఆయనకు నివాళులు అర్పిస్తున్నారని తెలిపారు. మదర్ థెరిస్సా సెంటర్ నందు వైయస్సార్ జయంతిని పురస్కరించుకుని పేదలు, వృద్ధులు, పిల్లలకు పండ్లు, రొట్టెలు, స్వీట్స్ పంచడం జరిగిందని అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ లాంటి పథకాలను గుర్తు చేసారు. ఐదేళ్ల లలో రాజశేఖర్ రెడ్డి పాలనలో దేశంలో 500 సంవత్సరాలు ప్రతి పేదవాడికి గుర్తుండే విధంగా సువర్ణ పాలన కొనసాగిందని అన్నారు. తండ్రి పేదల కోసం ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి 10 అడుగులు ముందుకు వేశారన్నారు. వైయస్సార్ ఆశయ సాధన కోసం జగన్మోహన్ రెడ్డి నిరంతరంగా అలుపెరగకుండా కృషి చేస్తున్నారని అన్నారు. నాడు వైయస్సార్ చేసిన ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలతో రాష్ట్రం ముందుకు నడుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

## పేద ప్రజలకు సంక్షేమ దాత వైఎస్సార్ : ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయనీ రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండపేట రాజారత్న సెంటర్ లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఆయన 77వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. తొలుత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహంకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సుధీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను తెలుసుకుని ఆ కష్టాలనే సంక్షేమ పథకాలుగా రూపుదిద్ది ఎంతోమంది అభిమానాన్ని సంపాదించుకున్నారనీ పేర్కొన్నారు. ప్రజలకు గుండె చప్పుడు అయ్యారు. పథకాల విషయానికి వస్తే ఆరోగ్య శ్రీ నుంచి 108 వరకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నుంచి రుణమాఫీ వరకు ఇలా చెప్పుకుంటే పోతే చాలా పథకాలే ఉన్నాయన్నారు. ఆ మహానాయకుడు భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయన ప్రవేశపెట్టిన పథకాలు మాత్రం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శమయ్యాయనీ పేర్కొన్నారు. ప్రశంసలు అందుకున్నాయన్నారు. అందుకుంటూనే ఉన్నాయన్నారు. ఆ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ప్రజలు ఆయన్ని స్మరిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ రాజబాబు, టౌన్ వైసిపి ప్రెసిడెంట్ పిల్లి శ్రీనివాస్, మాజీ విప్ పోతంశెట్టి ప్రసాద్, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, రాష్ట్ర వైసిపి బిసి కార్యదర్శి యంద్ర బుజ్జీ, మాజీ షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అలీఖాన్ బాబా, మాజీ కౌన్సిలర్స్ ముమ్మిడివరపు బాపిరాజు, మారిశెట్టి సత్యనారాయణ , జొన్నపల్లి సత్తిబాబు, రూరల్ వైసిపి కన్వీనర్ అడబాల బాబ్జీ, వాసిరెడ్డి అర్జున్, పోతంశెట్టి సత్తిబాబు, పెంకే వెంకటరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురం శ్రీనివాస్, సత్తిబాబు, సాధనాల శివ భగవాన్, లేగ వెంకన్న, పోతుల ప్రసాద్, కోణాల చంద్ర బోస్, తుపాకుల ప్రసన్న కుమార్, జిల్లా యువజన విభాగ వైస్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి వీర్రాజు, లాజర్ , కొప్పిరెడ్డి ప్రసాద్, సన్మాల ధనరాజు, కొనగళ్ళ భాస్కర రావు, షేక్ సర్కార్, అన్ని గ్రామాల పార్టీ ప్రెసిడెంట్లు వార్డు నెంబర్స్, కౌన్సిలర్సు, అనుబంధ విభాగాల ప్రెసిడెంట్లు, పార్టీ నాయకులు, అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






### సమస్యల పరిష్కారంలో

# నాణ్యతకు, సంతృప్తి స్థాయిలకు పెద్దపీట వేయాలి

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాను ఫిర్యాదుల పరిష్కారంలో అగ్రగామిగా నిలపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కార సరళిపై బుధవారం ఉన్నతాధికారులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు, పునరావృతమైన (రీ-ఓపెన్) అర్జీలు, ఆడిట్‌లో గుర్తించిన అంశాలు, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను ఆమె సమగ్రంగా సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదును కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అర్జీదారుల సమక్షంలో పూర్తిగా విచారించాలని అధికారులను ఆదేశించారు. దీంతో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని బాధితుల్లో సంతృప్తి స్థాయిని పెంచే అవకాశం ఉంటుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యతకు

జేసీ వైఖోం నైదియాదేవి



అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అరకొర పరిష్కారాలతో అర్జీలను ముగించరాదని స్పష్టం చేశారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు వస్తున్నాయంటే క్షేత్రస్థాయిలో లోపాలు ఉన్నట్లేనని, అలాంటి పునరావృత ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. వివిధ శాఖల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను తక్షణమే సమీక్షించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను సకాలంలో, పారదర్శకంగా పరిష్కరించడం ద్వారానే ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో అర్జీదారుల సమక్షంలో విచారించి నిజమైన పరిష్కారం అందించే విధానాన్ని ప్రభుత్వ సిబ్బంది అలవర్చుకోవాలని సూచించారు. పునరావృత ఫిర్యాదుల మూల కారణాలను గుర్తించేందుకు డేటా ఆధారిత విశ్లేషణ చేపట్టాలని, ఆడిట్ సూచనలను వెంటనే అమలు చేస్తూ పనుల పురోగతిపై పారదర్శక నివేదికల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో తాత్కాలిక చర్యలకంటే శాశ్వత, సమగ్ర పరిష్కారాలకే ప్రాధాన్యత ఇవ్వాలని, శాఖల మధ్య సమన్వయంతో బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డీఆర్ఓ వి.సుబ్బారావు, ఆర్డీవో ఏ.సరళావతి, జీవీవీ సత్యనారాయణ, ఎస్డీసీ అచ్యుత కుమారి, డీఎస్‌వో అడపా ఉదయభాస్కర్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వైసీపీ నేత రమణారావు అధ్వర్యంలో

## మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహానేత, ప్రజాహృదయ నాయకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంచే రమణారావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాపురంలోని లూయిస్ బ్రెయిలీ అంధుల పాఠశాలలో విద్యార్థులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేసి, మహానేత వైఎస్ఆర్ గారి సేవాస్ఫూర్తిని స్మరించుకున్నారు. పేదల పక్షపాతి, సంక్షేమ పాలనకు చిరునామాగా నిలిచిన వైఎస్ఆర్ గారి ఆశయాలను కొనసాగిస్తూ, సేవా కార్యక్రమాల ద్వారానే వారికి నిజమైన నివాళి అర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు రాజోలు పరిశీలకులు దంగేటి రాంబాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సలాది సతీష్, ఉప్పలగుప్తం మండల జెడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఎంపిటిసి బోగిశెట్టి నర్సింగ్, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, మాజీ సర్పంచ్ నక్క సంపత్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు, పందిరి సుబ్బరాజు, నేరేడుమెల్లి శ్రీనివాసరావు, చెట్ల విద్యాసాగర్, దోనిపాటి వేణు, పండు అంబేద్కర్, దోనిపాటి చిరంజీవి, పరమట నాగరాజు, మురళి తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రక్తదానం.. ఎన్నో ప్రాణాలకు జీవనాధారం

### దివంగత ఎర్రాప్రగడ సూర్యనారాయణ స్మారకార్థం ఘనంగా రక్తదాన శిబిరం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మానవత్వానికి ప్రతీకగా, సమాజానికి ఆదర్శంగా నిలిచే స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దివంగత ఎర్రాప్రగడ సూర్యనారాయణ జయంతి సందర్భంగా ఆయన స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరం విశేష స్పందనతో విజయవంతమైంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, వైద్యులు, సామాజిక సేవకులు, స్వచ్ఛంద రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని దివంగత ఎర్రాప్రగడ సూర్యనారాయణ కుమార్తె డాక్టర్ ఎర్రాప్రగడ లక్ష్మీ సౌందర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. తన తండ్రి జ్ఞాపకాన్ని కేవలం స్మరించుకోవడానికే కాకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమం ద్వారా చిరస్థాయిగా నిలపాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ సౌందర్య మాట్లాడుతూ తమ కుటుంబం ఎదుర్కొన్న అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తన తండ్రి అనారోగ్యంతో పలుమార్లు ఆసుపత్రిలో చికిత్స పొందిన సమయంలో అత్యవసరంగా రక్తం అవసరమైన సందర్భాలు ఎన్నో ఎదురయ్యాయని తెలిపారు. ఆ సమయంలో స్వచ్ఛంద రక్తదాతలు అందించిన సహకారం తమ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని, ఒక యూనిట్ రక్తం విలువ ఎంత గొప్పదో ప్రత్యక్షంగా అనుభవించామని చెప్పారు. దురదృష్టవశాత్తు తమ తండ్రిని కాపాడుకోలేకపోయినా, ఆయన జ్ఞాపకార్థంగా మరొక కుటుంబం రక్తం కోసం ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ జీవితంలో కనీసం సంవత్సరానికి ఒకసారి అయినా స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కోనసీమ జిల్లా బ్లడ్ కోఆర్డినేటర్ గవర్రాజు, వైద్యులు డా. సునీల్ కుమార్, డా. రాజ్‌కుమార్, వారి స్నేహితులు విశేష సహకారం అందించారు. అలాగే అమలాపురంలోని సహస్ర బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుడు శ్రీహరి పర్యవేక్షణలో, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పవన్ కుమార్, విజయదుర్గతో పాటు వైద్య బృందం రక్త సేకరణను అత్యంత క్రమబద్ధంగా నిర్వహించింది. రక్తదాతలకు అవసరమైన వైద్య పరీక్షలు, భద్రతా చర్యలు, సలహాలు అందిస్తూ శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. రక్తదాన శిబిరంలో యువత, మహిళలు, సామాజిక సేవకులు, వివిధ వర్గాలకు చెందిన స్వచ్ఛంద దాతలు ఉత్సాహంగా రక్తదానం చేశారు. పలువురు తొలిసారిగా రక్తదానం చేయగా, మరికొందరు గతంలో అనేకసార్లు రక్తదానం చేసిన అనుభవాలను పంచుకున్నారు. రక్తదానం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ప్రతి దాతకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. వారి స్వచ్ఛంద సేవాభావం అనేక మంది ప్రాణాలకు ఆశాకిరణంగా నిలుస్తుందని కొనియాడారు. ఒక వ్యక్తి చేసిన రక్తదానం మూడు నుంచి నాలుగు మంది ప్రాణాలను కాపాడగలదని, రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, కుటుంబ సభ్యుల స్మారక దినోత్సవాలను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా రక్తదానం, అన్నదానం, మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, “రక్తదానం అనేది కేవలం ఒక దానం కాదు… అది ఒక ప్రాణానికి కొత్త ఆశను, ఒక కుటుంబానికి కొత్త జీవితాన్ని అందించే మహోన్నత మానవతా సేవ. మనం కోల్పోయిన జీవితాన్ని తిరిగి తీసుకురాలేము… కానీ మన రక్తదానం ద్వారా మరొక జీవితాన్ని కాపాడగలం. అదే నిజమైన నివాళి… అదే మానవత్వం” అని పేర్కొన్నారు. చివరగా ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి, రక్త కొరతతో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## అమలాపురం హౌసింగ్ ఏఈగా బొంతు షైనీ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం హౌసింగ్ ఏఈగా బొంతు షైనీ నియమితులయ్యారు. ఆమె గతంలో సమనస సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బాధ్యతలు స్వీకరించే సందర్భాన్ని పురస్కరించుకుని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావునీ మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. అలాగే అల్లవరం హౌసింగ్ ఏఈ ఇంచార్జి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు షైనీ మీడియాకు తెలిపారు. ఆమె నియామకం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

## ఓటు భద్రత కోసమే సర్ ప్రక్రియ

### ఓటర్లకు జేసీ విజ్ఞప్తి

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం సజావుగా కొనసాగుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి తెలిపారు. జిల్లాలోని 9,69,628 మంది ఓటర్లకు సంబంధించి 73.74 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఓటరు హెల్ప్‌డెస్క్‌లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, ఓటర్లకు ఫారాలు నింపడంలో సహాయం చేయడం, సందేహాలను నివృత్తి చేయడం వంటి సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను సేకరిస్తున్నారని, ఇప్పటికే ఫారాలు తీసుకున్న ఓటర్లు జూలై 14లోపు తప్పనిసరిగా వాటిని పూర్తి చేసి సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఫారం అందని వారు తమ బీఎల్‌వోను సంప్రదించవచ్చని, అలాగే voters.eci.gov.in వెబ్‌సైట్‌లోని “Book a Call with BLO” సదుపాయం ద్వారా బీఎల్‌వోతో నేరుగా సంప్రదించి ఫారం పొందడం, నింపడం, ఇతర సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఓటర్ల తొలగింపు కోసం కాదని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం, అర్హులైన ఎవరూ ఓటర్ల జాబితా నుంచి మినహాయించబడకుండా చూడడమే ఎన్నికల సంఘం లక్ష్యమని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ప్రజలందరూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## వాడవాడలా వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పలు సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా వైఎస్ రాజశేఖరరెడ్డి పేద, మధ్య తరగతి జీవితాలలో వెలుగులు నింపారని ఆలమూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకర రావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన ఆలమూరు బస్ స్టాండ్ సెంటర్లో గల వైయస్సార్ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టి, వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు, స్థానిక 30 పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి తోరాటి సీతామహాలక్ష్మి రాంబాబు, గుణ్ణం రాంబాబు, చల్లా లక్ష్మీ భూషణం, కట్టా శ్రీనివాసు, యు సుందర విజయం, ఆకుల ప్రసాద్ (పండు), నాంద్ర నాగమోహన్ రెడ్డి, చల్లా సుబ్బయ్య, కొప్పనాతి శ్రీను, పడమటి రాంబాబు, కంచుమర్తి బాబులు, డాక్టర్ యు ప్రసాద్, తమ్మన హరికృష్ణ, మోటూరి సురేష్, దొండపాటి అయోధ్య శ్రీరాములు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కాట్రేనికోన హైస్కూల్ ప్రారంభోత్సవంలో వివాదం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్లో ఒక దాత నిర్మించిన డైనింగ్ హాల్ను బుధవారం మీసాల దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అయితే ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు కుర్చీలు మోయడంపై స్థానికంగా పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని విద్యా వేత్తలు కోరుతున్నారు.

## అయినవిల్లి క్షేత్రంలో దేవాదాయ శాఖ అధికారుల పర్యటన



**అయినవిల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ వి. త్రినాధ రావు ఈరోజు అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా 2027 గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులలో భాగంగా శరవేగంగా జరుగుతున్న పునఃనిర్మాణ పనులు, నూతన అన్నప్రసాద భవనం (అన్నపూర్ణ నిలయం) నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకొని, పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ డి.ఎల్.వి. రమేష్ బాబు, ఎస్.ఈ టి. దుర్గేష్, ఈఈ శ్రీనివాస్, డిప్యూటి ఈఈ ఎన్. ఉదయ్ కుమార్, జిల్లా ఏసీ సత్యనారాయణ, ఇంజినీరింగ్ శాఖ అధికారులు మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్సార్ పేద ప్రజల గుండెల్లో నిలిచారు : పొన్నాడ



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిర స్మరణీయుడుగా నిలిచి ఉంటారని వైసీపీ కో-ఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీశ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ముమ్మిడివరం పోలమ్మచెరువు గట్టున వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు

### రాజీయే రాజమార్గం... వివాదాలకు ముగింపు...

# సంబంధాలకు కొత్త ఆరంభం



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట సబ్ డివిజన్ పి.గన్నవరం సర్కిల్ జూలై 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి అని పి.గన్నవరం సి.ఐ బీమరాజు పిలుపు నిచ్చారు. కేసుల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను ఇరు పక్షాలకు వివరించి, పరస్పర అవగాహన, చర్చలు, రాజీ ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశామన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి కోర్టు ఫీజులు లేకుండా, తక్కువ సమయంలో, సామరస్యపూర్వకంగా వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఈ విలువైన అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలి అని పిలుపునిచ్చారు.

### అమలాపురంలో ఘనంగా

# వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు

**వైయస్సార్ విగ్రహానికి నివాళులు - సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ పినిపే శ్రీకాంత్**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా అమలాపురం పట్టణం లో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి డాక్టర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయేల్, కుడిపూడి సూర్యనారాయణరావు, మాజీ ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ పినిపే శ్రీకాంత్, వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పాలన, పేదల అభ్యున్నతి కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జయంతి సందర్భంగా వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్‌ను డాక్టర్ పినిపే శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, దుప్పట్లు పంపిణీ చేసి పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, అమలాపురం నియోజకవర్గ పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, ఎస్ఈసీ సభ్యుడు కుడుపూడి భరత్, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనాగేంద్ర మణి, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాకినాడ రూరల్ టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ



తెలుగుదేశం పార్టీ

ఉండవల్లిలో అధిష్టానం కీలక నిర్ణయం • జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అధికారిక ప్రకటన • క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కొత్త బాధ్యతలు



మాట్లాడుతున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్

**కాకినాడ, విశ్వం వాయిస్ బ్యూరో**

కాకినాడ రూరల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. నియోజకవర్గ పార్టీ నూతన ఇన్‌ఛార్జ్‌గా మాజీ శాసనసభ్యురాలు పిల్లి సత్యనారాయణ మూర్తి అనంతలక్ష్మిని పార్టీ అధిష్టానం నియమించింది. ఉండవల్లిలోని జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నివాసంలో బుధవారం జరిగిన అత్యంత కీలకమైన సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నియామకానికి సంబంధించిన వివరాలను కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఒక అధికారిక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

### త్రిమూర్తుల ఆదేశాల మేరకు..

టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుల సంయుక్త ఆదేశాల మేరకు, వారి ఆమోదంతోనే ఈ కీలక బాధ్యతలను పిల్లి అనంతలక్ష్మికి అప్పగించినట్లు జ్యోతుల నవీన్ కుమార్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పార్టీని మరింత సమర్థవంతంగా ముందుకు నడిపించే వ్యూహంలో భాగంగానే అధిష్టానం ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

### అనుభవానికి పెద్దపీట.. క్షేత్రస్థాయిలో దూకుడు!


పిల్లి సత్యనారాయణమూర్తి, అనంతలక్ష్మి దంపతులకు ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజాకర్షణ మరియు బలమైన నాయకత్వ ప్రతిభ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయి (గ్రౌండ్ లెవెల్) నుండి మరింత బలోపేతం చేయడానికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఈ సందర్భంగా గట్టి విశ్వాసం వ్యక్తం చేశారు.

### అందరినీ కలుపుకుని.. ప్రజల్లోకి!

రాబోయే రోజుల్లో కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని స్థానిక నాయకులను, సీనియర్లను, చురుకైన కార్యకర్తలను అందరినీ ఒకే తాటిపైకి తెస్తూ.. సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని నూతన ఇన్‌ఛార్జ్‌కు పార్టీ సూచించింది. కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని, నియోజకవర్గ సమస్యల పరిష్కారంలో అండగా నిలవాలని కోరారు.

### నియోజకవర్గంలో పండుగ వాతావరణం

పిల్లి అనంతలక్ష్మిని కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జ్‌గా నియమించడం పట్ల నియోజకవర్గ పరిధిలోని టీడీపీ ముఖ్యాధికారులు, అనుబంధ సంఘాల నాయకులు, స్థానిక కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందని, ఆమె నాయకత్వంలో కాకినాడ రూరల్‌లో పార్టీ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పలువురు నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



పిఠాపురం వద్ద మాట్లాడుతున్న సందత్యం



ఉండవల్లిలో జరిగిన కీలక సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

### నియోజకవర్గంలో పండుగ వాతావరణం

పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ నియామకంపై నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందని శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

---

బాలల రక్షణ, సంక్షేమానికి

## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మిషన్ వాత్సల్య పథకం అమలుపై జిల్లా బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ సమావేశం బుధవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారిత అధికారి సీహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో జిల్లాలో బాలల సంరక్షణ, రక్షణ, పునరావాసం, విద్య, ఆరోగ్యం మరియు సంక్షేమానికి సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా పరిషత్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, లీడ్ బ్యాంక్, మైనారిటీ, గిరిజన, బీసీ సంక్షేమం, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్యం, పోలీస్, కార్మిక, దేవదాయ శాఖల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ వాత్సల్య పథకం అమలు పురోగతి, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికలు అలాగే బాలల రక్షణకు సంబంధించిన వివిధ శాఖల సమన్వయం, అవసరమైన చర్యలపై చర్చించారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో బాలలపై జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోక్సో కేసులు నమోదైన వెంటనే సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలకు నివేదించి, బాధిత బాలబాలికలకు తక్షణ కౌన్సిలింగ్, అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. బాల్యవివాహాలు జరుగుతున్నాయని సమాచారం వచ్చిన వెంటనే పోలీస్ శాఖ నుంచి సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి, బాల్య వివాహ నిరోధక అధికారితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. కాకినాడలో నడుపుతున్న శిశు సంరక్షణ గృహాలు, జువెనైల్ జస్టిస్ యాక్ట్ పరిధిలో అనుమతులు తీసుకున్నాయా లేదా, లేక ఇతర ఏ చట్ట పరిధిలో అనుమతులు పొందాయో సమగ్రంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ కమిటీ మెంబర్ సంతోష్ కుమారి, జిల్లా పరిషత్ సీఈఓ వివివిఎస్ లక్ష్మణరావు, ఎల్డీఎం సీహెచ్ఎస్వీ ప్రసాద్, ఇంటర్ డీఐఈవో జె రాంబాబు, డీఎస్డీవో సతీష్ కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు, సంరక్షణ అధికారులు కె శ్రీనివాస్, విజయ, శిశుగృహ మేనేజర్ రత్న, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

---

ప్రకాష్ రాజ్... నీకు సిగ్గుందా?

## దేశద్రోహులను సమర్థిస్తావా..?

గత వైసీపీ పాలనలో జరిగిన అన్యాయాలను ఏనాడైనా ప్రశ్నించావా?
ప్రకాష్ రాజ్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక మాధ్యమాల వేదికగా దేశద్రోహులను సమర్థిస్తూ, వ్యక్తిగత కక్షతో జనసేన పార్టీ విధానాలు, అధినేత పవన్ కళ్యాణ్ గారిపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న సినీ నటుడు ప్రకాష్ రాజ్‌పై కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తీవ్రస్థాయిలో స్పందించారు. బుధవారం కాకినాడ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ "జస్ట్ ఆస్కింగ్" పేరుతో మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని సమర్థిస్తున్న ప్రకాష్ రాజ్‌కు పవన్ కళ్యాణ్ గారిని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు, దాడులు, ప్రజాస్వామ్య విలువల విధ్వంసంపై ఏనాడూ నోరు మెదపని ప్రకాష్ రాజ్, ఇప్పుడు సినిమాల్లో అవకాశాలు లేక చౌకబారు రాజకీయ విమర్శలకు దిగడం దురదృష్టకరమన్నారు. వైసీపీ ప్రోత్సాహంతోనే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. మా అధినేత పవన్ కళ్యాణ్ మాకు సంస్కారం నేర్పారని, అందుకే హుందాగా స్పందిస్తున్నామని, అయితే హద్దులు దాటి వ్యక్తిగత విమర్శలు చేస్తే తగిన రీతిలో రాజకీయంగా సమాధానం ఇస్తామని హెచ్చరించారు. బెంగళూరులో ఎన్నికల్లో ఘోర పరాజయం పాలై ఆ నియోజకవర్గ ప్రజలను పట్టించుకోని ప్రకాష్ రాజ్, ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న పవన్ కళ్యాణ్ గారిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. పవన్ కళ్యాణ్ స్థాయి, ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణ రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసన్నారు. పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేసి చౌకబారు ప్రచారం పొందాలనే ప్రయత్నాలను ప్రజలు నమ్మరని, ఎవరు దేశభక్తులో, ఎవరు అవకాశవాదులో ప్రజలకు స్పష్టంగా తెలుసని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రకాష్ రాజ్ తన స్థాయికి తగిన విధంగా బాధ్యతాయుతంగా మాట్లాడాలని, లేకపోతే తగిన రీతిలో బుద్ధి చెబుతామని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హెచ్చరించారు.

---

## ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులతో భయపెట్టిస్తారా..

ఎమ్మెల్యే నానాజీ మాటలను ఖండిస్తున్నాం - కూటమి నాయకులకు ఒక న్యాయం, ప్రజలకు మరో న్యాయమా
జెబిపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది జగ్గారపు మల్లికార్జున




**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులతో భయపెట్టిస్తున్నారని ప్రభుత్వంలో ఉండే నాయకులకు ఒక న్యాయము సాధారణ ప్రజలకు మరో న్యాయమా అంటూ కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ జై భీమ్ రావు భారత పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రముఖ న్యాయవాది జగ్గారపు మల్లికార్జున విమర్శించారు. బుధవారం కాకినాడ జిల్లా జై భీమ్ రావు భారత పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మల్లికార్జున మాట్లాడుతూ గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయించి వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందని ప్రశ్న రావణ్ కేసును తాను పిఠాపురంలో స్వయంగా చూడడం జరిగిందని, తమ అధినేత జడ శ్రావణ్ కుమార్ రాకతో పిఠాపురం, సర్పవరం మరియు మచిలీపట్నం పోలీస్ స్టేషన్లో ప్రశ్న రావణ్ కు బెయిల్ మంజూరు కావడంతో కూటమి ప్రభుత్వానికి నిద్రలేకుండా పోయిందన్నారు. జూన్ 28వ తేదీన ఏలూరులో జై భీమ్ రావు భారత పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రైస్తవుల సమర శంఖారావం సభకు ప్రశ్న రావన్ను ముఖ్యఅతిథిగా పిలవడం జరిగిందని, ప్రశ్న రావణ్ కొత్తగా ఏ మాటలు మాట్లాడలేదని ఉప ముఖ్యమంత్రి అన్న మాటలానే సభలో ప్రశ్న రావణ్ ప్రస్తావించడం జరిగిందని ప్రశ్నా రావణ్ పై కేసులు పెట్టిన పోలీసులు ఉప ముఖ్యమంత్రి పై ఎందుకు కేసులు కట్టడం లేదని ప్రశ్నించారు. గత వారం రోజుల్లో జరిగిన ప్రశ్న రావానికి సంబంధించి అన్ని ఘటనలు రాష్ట్ర ప్రజలు చూశారని, ప్రశ్న రావణ్ పై ఎన్ని అక్రమ కేసులు బనాయించి పోలీస్ స్టేషన్లో చుట్టూ కూటమి ప్రభుత్వం ఎలా చెప్పిందో రాష్ట్ర ప్రజలు గమనించారన్నారు. సోషల్ మీడియాలో మాట్లాడిన మాటలకు కేసులు బెల్ వచ్చే విధంగా ఉన్నాయి కాబట్టి ఉప చట్టం పెట్టి ప్రశ్న రావణ్ ను రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. ఈ రాష్ట్రంలో అసలు ప్రతిపక్షం ఉందో లేదో తెలియడం లేదని రాష్ట్ర ప్రజలు 11మంది వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యేలను గెలిపిస్తే వారు అసెంబ్లీకి వెళ్లి సమస్యలపై పోరాటం చేయకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన వాలు పనిచేయకపోవడంతో కూటమి ప్రభుత్వానికి మరింత బలం చేకూరుతుందని, ప్రశ్నించవలసిన ప్రతిపక్షం ప్రశ్నించకుండా మౌనంగా ఉండటం వలన కూటమి ప్రభుత్వం ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారన్నారు.

---

## విద్యుత్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలి



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యుత్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందిం చుకోవాలని విద్యుత్ తనిఖీ అధికారి పి.బాలకృష్ణ పేర్కొన్నారు. కోరమండల్ ఎరువుల కర్మాగారంలో నిర్వహించిన విద్యుత్ భద్రతా వారోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాలకృష్ణ మాట్లాడుతూ ప్రధానంగా కర్మాగారంలో పనిచేసే సిబ్బంది విద్యుత్ భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. కోరమండల్ కర్మాగారంలో పాటిస్తున్న విద్యుత్ భద్రతా విధానాలను కొనియాడారు. మెయింటెనెన్స్ హెడ్ కమల్ కుమార్ మాట్లాడుతూ కర్మాగారంలో అమలు చేస్తున్న విద్యుత్ భద్రతా ప్రమాణాల విధానాలను సిబ్బందికి వివరించారు. కాకినాడ కోరమండల్ యూనిట్ హెడ్ జగన్నాథన్ మాట్లాడుతూ పరిశ్రమల్లో విద్యుత్ ఆవశ్యకత గృహంలో విద్యుత్ వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అనంతరం ఎంప్లాయిస్ యూనియన్ లీడర్ నూకరాజు మాట్లాడుతూ పరిశ్రమలో విద్యుత్ భద్రతా విధానాన్ని కొనియాడారు. హెచ్ ఆర్ పద్మనాభం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలక్ట్రికల్ సేఫ్టీ పాటించాలని కోరారు. అనంతరం విద్యుత్ భద్రతపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజయం సాధించిన ఉద్యోగులకు మరియు కాంట్రాక్ట్ సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ హెడ్ గంగాధర్, ఇంజనీర్లు సుబ్బరాజు, వివేక్, సిద్దార్ధ, శ్రీనివాసకుమార్, వెంకటదుర్గ, వెంకటరాయలు, రామరాజు ఫ్యాక్టరీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# గడువులోపు పనులు పూర్తి చేయాలి

**విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి**

**మెగా కంపెనీ ప్రతినిధులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి సూచన - వైద్య కళాశాల ఆకస్మిక తనిఖీ**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే స్పందించిన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సంబంధిత అధికారులు, నిర్మాణాలు మరియు నిర్వహణ పనులు చేపడుతున్న మెగా కంపెనీ ప్రతినిధులతో సమావేశమై జరుగుతున్న పనుల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే వాసు ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని మెగా కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ముఖ్యంగా కొత్త భవనానికి అప్రోచ్ రోడ్డు, ప్రవేశ మార్గాలు, లెక్చర్ గ్యాలరీలు, ఎలక్ట్రికల్ పనులు, పైపింగ్, ఆడియో-వీడియో టెస్టింగ్ వంటి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొత్తగా అడ్మిషన్లు పొందే విద్యార్థులకు తరగతుల నిర్వహణలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఇప్పటికే ఉన్న బ్లాకులను తాత్కాలికంగా వినియోగించుకోవాలని, నిర్మాణ ప్రాంతాల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిర్మాణ సామగ్రి కారణంగా ఎక్కడా ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మెగా కంపెనీ ప్రతినిధులకు స్పష్టం చేశారు. జూలై 25 నాటికి కొత్త లెక్చర్ గ్యాలరీలను విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని, అధికారిక ప్రారంభోత్సవం కోసం ఎదురు చూడకుండా విద్యార్థులకు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థుల్లో విశ్వాసం పెంచేలా ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణపై ప్రత్యేకంగా సమీక్షించిన ఎమ్మెల్యే వాసు ఆగస్టు 15 నాటికి పరీక్షా హాళ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. జనరేటర్, ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, పవర్ బ్యాకప్, ప్రింటింగ్ వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. టాయిలెట్ సౌకర్యం లేని భవనాలను పరీక్షా హాళ్లుగా వినియోగించడం సరికాదని, అవసరమైతే వాటిని ల్యాబ్‌లుగా మార్చి, పరీక్షల కోసం అన్ని ప్రమాణాలు ఉన్న హాళ్లనే ఉపయోగించాలని సూచించారు. హాస్టళ్ల నిర్మాణ పురోగతిపైనా ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. కొత్త హాస్టల్ భవనాల్లో కనీసం రెండు అంతస్తులను ఆగస్టు నాటికి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు తాత్కాలిక భవనాల్లో వసతి కల్పిస్తూ, మిగిలిన విద్యార్థులకు శాశ్వత భవనాల్లో సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. బాలురు, బాలికల హాస్టళ్లకు అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఇతర మౌలిక వసతుల పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల చదువులు, పరీక్షలు, వసతి, భద్రతకు సంబంధించిన ఏ అంశంలోనూ రాజీ ఉండదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. నిర్ణయించిన గడువుల్లో అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని మెగా కంపెనీ ప్రతినిధులు, సంబంధిత అధికారులకు ఆదేశించారు. పనుల పురోగతిని తాను నిరంతరం పర్యవేక్షిస్తానని, అవసరమైతే మళ్లీ స్వయంగా తనిఖీ నిర్వహిస్తానని తెలిపారు.

# ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

**నగర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ మార్గాని భరత్**

**కల్తీ పాల ఘటన బాధిత చిన్నారులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ**




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం నగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి మాజీ ఎంపీ మార్గాని భరత్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఈసీ సభ్యుడు, మాజీ రుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరు శ్రీనివాస్, ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల కల్తీ పాల ఘటనలో బాధితులుగా చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పంపించిన ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.2 లక్షల చెక్కులను మార్గాని భరత్ ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. చిన్నారి రుహానియాకు రూ.1 లక్ష, చిన్నారి రితిక్‌కు రూ.1 లక్ష చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మోరంపూడి జంక్షన్‌లో చీరా రాజు, అరె చిన్ని ఆధ్వర్యంలో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 28వ వార్డులో యువజన విభాగం అధ్యక్షుడు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో నిర్వహించిన పేదలకు చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కోటగుమ్మం వద్ద బీసీ నాయకుడు ఉమ యాదవ్ మిత్రబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొని పేదలకు గొడుగులు పంపిణీ చేశారు. అలాగే క్వారీ సెంటర్‌లో 45, 46, 47, 48, 49 వార్డుల ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. లాలాచెరువులో వార్డు యువనాయకుడు హర్ష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్గాని భరత్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సంక్షేమ పాలనకు స్వర్ణయుగానికి నాంది పలికిన నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించి మహానేతకు ఘనంగా నివాళులర్పించామని తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 అంబులెన్స్ సేవలు, మహిళలకు సున్నా వడ్డీ డ్వాక్రా రుణాలు, రైతులకు ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలకు వైఎస్ రాజశేఖరరెడ్డి రూపకర్త అని కొనియాడారు. కల్తీ పాల ఘటనలో బాధిత చిన్నారులకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పంపించిన రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ఈరోజు అందజేయడం ఆనందంగా ఉందని భరత్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శులు వాసంశెట్టి గంగాధర్, సంయుక్త కార్యదర్శి గుర్రం గౌతం, సీనియర్ నాయకులు మార్తి నాగేశ్వరరావు, దాసి వెంకటరావు, కానుబోయిన సాగర్, సిటీ మహిళా అధ్యక్షురాలు పోలు విజయలక్ష్మి, మార్గాని సురేష్, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, పెద్దిరెడ్ల శ్రీనివాస్, అందనపల్లి సత్యనారాయణ, కంది రాఘవ, మునీశ్వరరావు, చోటా ఖాన్, దుర్వాసుల సత్యనారాయణ, మదీనా బాషా, అక్రం, టేకుముడి సూరిబాబు, షబ్బీర్, నల్లా రామాంజనేయులు, రొక్కం త్రినాథ్, దత్త, విజయ్, నందం స్వామి, కృష్ణవేణి, అనంతలక్ష్మి, అనురాధతో పాటు రాష్ట్ర, జిల్లా, సిటీ నాయకులు, వార్డు ఇంచార్జ్‌లు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరై మహానేతకు ఘనంగా నివాళులర్పించిన ప్రతి ఒక్కరికీ మార్గాని భరత్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్యుమరేషన్ ఫారం సమర్పించిన వారికే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు

**ఈనెల 14లోపు ఎన్యుమరేషన్ ఫారాలు బీఎల్వోలకు అందజేయాలి**

**సందేహాల నివృత్తికి బీఎల్వోలు, హెల్ప్‌డెస్క్‌లు, 1950 హెల్ప్‌లైన్‌ను సంప్రదించండి : జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి ఓటరు తమ ఎన్యుమరేషన్ ఫారాన్ని సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్వోలు)కు జూలై 14వ తేదీలోపు తప్పనిసరిగా సమర్పించాలని, ఎన్యుమరేషన్ ఫారం సమర్పించిన వారి పేర్లు మాత్రమే జూలై 21న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పొందుపరచబడతాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, ఓటర్ల నుంచి పూర్తిగా నింపిన ఫారాలను స్వీకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఫారం అందని వారు లేదా ఫారం నింపడంలో సందేహాలు ఉన్న వారు వెంటనే సంబంధిత బీఎల్వోలను సంప్రదించాలని సూచించారు. ఫారం నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే బీఎల్వోలు వాటిని నివృత్తి చేస్తారని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లు కూడా https://voters.eci.gov.in వెబ్‌సైట్ లేదా ECI NET App ద్వారా ఆన్‌లైన్‌లో ఎన్యుమరేషన్ ఫారాన్ని సమర్పించవచ్చని చెప్పారు. అలాగే "బుక్ ఎ కాల్ బీఎల్వో" సదుపాయం ద్వారా బీఎల్వోలను సంప్రదించి అవసరమైన సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఓటరు వివరాలను 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నామని తెలిపారు. ఒకవేళ 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాకపోతే "నో మ్యాపింగ్"గా నమోదు చేస్తారని చెప్పారు. అటువంటి ఓటర్ల పేర్లు కూడా డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉంటాయని, అనంతరం వారికి ప్రత్యేక నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆ నోటీసులకు ప్రతిస్పందనగా ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల గుర్తింపు పత్రాలలో ఏదైనా ఒకటి సమర్పించి భారత పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుందని వివరించారు. అనంతరం ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు 8 మంది ఎన్నికల నమోదు అధికారులు, 170 మంది సహాయ ఎన్నికల నమోదు అధికారులు, 23 మంది మండల స్థాయి నోడల్ అధికారులు, 189 మంది BLO సూపర్‌వైజర్లు, 1,804 మంది బీఎల్వోలు, 2,608 మంది సహాయక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 8 వ తేదీ ఉదయం 8 గంటల నాటికి జిల్లాలోని 18,46,723 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారాలను 100 శాతం ముద్రించగా, 18,35,432 ఫారాలు (99.39 శాతం) పంపిణీ పూర్తయిందని, 12,85,071 ఫారాలు (69.59 శాతం) డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారం సమర్పించని వారి వివరాలతో జాబితాగా సిద్ధం చేసి డ్రాఫ్ట్ ఓటరు జాబితాతో పాటు ప్రచురిస్తామని తెలిపారు. అందువల్ల ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఎన్యుమరేషన్ ఫారాన్ని సంబంధిత బీఎల్వోకు సమర్పించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఫారం నింపడంలో సందేహాలు ఉన్నవారు ఎన్నికల సంఘం హెల్ప్‌లైన్ 1950, జిల్లా కంట్రోల్ రూమ్ 0883-2944455, జిల్లా హెల్ప్‌డెస్క్ నెంబర్లు 9347794619, 9505136146లను సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా సంబంధిత నియోజకవర్గ హెల్ప్‌డెస్క్‌లు, బీఎల్వోల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. సరైన, పారదర్శకమైన, తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని, జూలై 14వ తేదీలోపు తమ ఎన్యుమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించి ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, కలెక్టరేట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**జక్కంపూడి ఆధ్వర్యంలో**

# వాడవాడల వైఎస్సార్ జన్మదిన వేడుకలు

**మహా రక్తదాన శిబిరానికి విశేష స్పందన**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జన్మదిన వేడుకలు వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం నియోజవర్గ మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో మండలంలో వాడవాడలా వైభవంగా నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బుధవారం వైయస్సార్ జన్మదిన వేడుకలు సందర్భంగా వైయస్సార్ విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. కోరుకొండ వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో మండల యువజన విభాగం అధ్యక్షులు గట్టి వీరప్రసాద్ ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరానికి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున విచ్చేసి, రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ మహానేత దివంగత రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, ఆంధ్రుల జీవనాడి పోలవరం కాలువకు శ్రీకారం, రైతులకు ఉచిత విద్యుత్తు వంటి సంక్షేమ పథకాలతో ఉభయ రాష్ట్రాల ప్రజలు గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. రాజశేఖర్ రెడ్డి లేకపోవడంతో చంద్రబాబు రాష్ట్రని రెండుగా విభజించి, ఆంధ్ర రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. తండ్రి ఆశయ సాధన కోసం, తండ్రి మించిన తనయుడిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమానికి దేశంలోనే కేరాఫ్ అడ్రస్ గా మారారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తూ, లా అండ్ ఆర్డర్ ను అడ్డుపెట్టుకొని ఇప్పటివరకు వైయస్సార్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని, నేటి నుండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రజల పైన అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు చేస్తున్నారన్నారు. రక్తదాన శిబిరంలో మీరు చేస్తున్న రక్తదానం ఎందరో ప్రాణాలను నిలబెడుతుందని, మీరు చేస్తున్న సహాయం ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి నాయకులు కర్రి నాగేశ్వరరావు, అడపా కనకరాజు, గణేశుల పోశయ్య, ఉల్లి గణ, కొండపల్లి దుర్గారావు, సిహెచ్ శ్రీహరి, బొండాడ చందు, నేతుల చిన్ని, తోరాటి సత్య ప్రసాద్, శ్రీరంగం శ్రీను, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విజయదుర్గ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న జక్కంపూడి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం ఉండేశ్వరపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయదుర్గ అమ్మ వారి ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు,, రాజాన గరం మాజీ ఎమ్మెల్యే జక్కం పూడి రాజా అమ్మవారిని దర్శిం చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ప్రతిష్ట మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొ న్నారు.

# కేశవరంలో వైయస్సార్ జయంతి వేడుకలు




**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** పేదల ఆశలను సంక్షేమ పథకాలుగా మలిచి, లక్షలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి అని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి దూలం వెంకన్న బాబు స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆ మహనీయున్ని స్మరించుకుంటూ అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసి సభ్యులు అన్నందేవుల కృష్ణ, పార్టీ నాయకులు వుండమట్ల శ్రీ శ్రీ, అద్దంకి రమణ, అల్లంపల్లి కిశోర్, రాయపాటి సత్యనారాయణ, పలుకురి వెంకన్నబాబు, వుండమట్ల శ్రీను, మాచిరెడ్డి సురేష్, మన్నే ఉమా, కూసు దొరజీ, విన్నకోట ప్రసాద్, పెదపాటి సాయిబాబు, యడ్ల రవి, తవిటికి మహేష్, కొక్కిరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మండల యువజన విభాగం అధ్యక్షులుగా గట్టి

**- గట్టి, తోరాటికి పలువురు అభినందనలు**




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండల యువజన విభాగం అధ్యక్షులుగా గట్టి వీరప్రసాద్ ను నియమించినట్లు వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా తెలిపారు. అదే విధంగా సమాచార సేకరణ విభాగం అధ్యక్షులుగా తోరాటి సత్యప్రసాద్ ను నియమించానన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ మూడు మండలాల్లో వివిధ విభాగాల్లో అన్ని కమిటీలను పూర్తి చేశానన్నారు. ఒక్కొక్క మండలానికి 24 కమిటీలను నిర్మిస్తూ, వారి చేపట్టవలసిన కార్యాచరణ పై విధివిధానాలను తెలియజేశారు. ఎన్డీఏ ప్రభుత్వానికి రెండేళ్లు సమయం ఇచ్చామని, అధికారం చేపట్టిన రెండేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిపై అనేక అక్రమ కేసులు బనాయిస్తున్నా రన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజల పక్షన్న నిలబడి పోరాడాలన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీసభ్యులకు వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మళ్లీ పెళ్లి చేసుకున్న

# హీరోయిన్ 'కలర్స్' స్వాతి..





టాలీవుడ్ హీరోయిన్ కలర్స్ స్వాతి సర్ ప్రైజ్ ఇచ్చింది. ఎలాంటి హడావిడి, ప్రకటన లేకుండా ఉన్నట్లుండి మళ్లీ పెళ్లి చేసుకుంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను స్వయంగా ఆమెనే సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీంతో పలువురు సినీ ప్రముఖులు ఆమెకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'కలర్స్' స్వాతిగా గుర్తింపు తెచ్చుకున్నటాలీవుడ్ హీరోయిన్ మళ్లీ పెళ్లి చేసుకుంది. అది కూడా ఓ టాలీవుడ్ దర్శకుడినే కావడం విశేషం. తన పెళ్లికి సంబంధించిన ఫొటోలని స్వాతినే స్వయంగా సోషల్ మీడియాలో షేర్ చేసింది. పెళ్లి దుస్తుల్లో భర్తతో కలిసున్న ఫొటోను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేస్తూ 'పెళ్లి చేసుకున్నాం' అని క్యాప్షన్ ఇచ్చింది. ఈ పోస్ట్ కు తన భర్త ఇన్ స్టా గ్రామ్ అకౌంట్ ను కూడా ట్యాగ్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ సోషల్ మీడియాతో పాటు టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారిపోయాయి. ఇంతకీ స్వాతి పెళ్లి చేసుకున్నది మరెవరినో కాదు ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ నాగోతి. స్వాతి ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మంత్ ఆఫ్ మధు' మూవీకి శ్రీకాంతే దర్శకుడు. అయితే వీరు ఎప్పుడు ప్రేమలో పడ్డారో తెలియదు కానీ బుధవారం(జూలై 08) ఇద్దరూ పెళ్లిపీటలెక్కారు. ఇంట్లోనే సింపుల్‌గా ఈ వేడుక జరిగినట్లు ఈమె పోస్ట్ చేసిన ఫొటోల బట్టి అర్థమవుతోంది. కాగా ఈ ఫొటోలను చూసి పలువరు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు స్వాతి-శ్రీకాంత్ దంపతులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాగా స్వాతికి ఇది రెండో వివాహం. 2018లో ఆమె వికాస్ వాసు అనే పైలెట్ ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే ఏమైందో తెలియదు కానీ కొద్ది కాలానికే ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఇద్దరూ విడిపోయారు. అయితే వీళ్లిద్దరూ విడాకులు తీసుకున్న విషయం బయటకు రాలేదు. స్వాతి కూడా ఈ విషయంపై మాట్లాడడానికి ఇష్టపడలేదు. అయితే ఇప్పుడు మాత్రం మళ్లీ పెళ్లి చేసుకుని అందరికీ షాక్ ఇచ్చింది అందాల తార.

## మహేష్ బాబు మేనకోడలు లేటెస్ట్ ఫొటోస్ చూశారా?

# ట్రెండీ దుస్తుల్లో మతిపోగొడుతున్న జాన్వీ

సూపర్ స్టార్ మహేష్ బాబు మేనకోడలు, నటి మంజుల గారాల పట్టి జాన్వీ స్వరూప్ త్వరలోనే సినిమా ఇండస్ట్రీలోకి హీరోయిన్ గా అడుగు పెట్టనుంది. కొన్ని రోజుల క్రితం స్వయంగా మంజులనే ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ క్రమంలో జాన్వీ తెరంగేట్రం గురించి మరిన్ని అప్డేట్స్ రానున్నాయి. సూపర్ స్టార్ కృష్ణ నట వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆ ఫ్యామిలీ నుంచి మూడో తరం రెడీ అవుతోంది. ఇప్పటికే మహేష్ బాబు స్టార్ హీరోగా రాణిస్తుండగా ఆయన కూతురు సితార ఘట్టమనేని ఇప్పటికే యాడ్స్ లో నటిస్తూ బిజీ బిజీగా ఉంటోంది. ఇక గౌతమ్ కూడా తెరంగేట్రానికి రెడీ అవుతున్నాడు. అతను ఇప్పటికే మహేష్ నటించిన వన్.. నేనొక్కడినే సినిమాలో కనిపించాడు. ఇక కృష్ణ సోదరుడు, దివంగత రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. అతను హీరోగా నటించిన శ్రీనివాస మంగాపురం సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక వీరితో పాటు మహేష్ బాబు మేనకోడలు, మంజుల గారాల పట్టి జాన్వీ స్వరూప్ కూడా త్వరలోనే కెమెరా ముందుకు రానుంది. ఆమె తెరంగేట్రం గురించి ఇప్పటికే మంజులనే స్వయంగా ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. దీనికి సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పక్కాగా జరుగుతున్నాయి. కాగా సినిమాల కంటే ముందు సోషల్ మీడియాలో బాగా ఫేమస్ అవుతోంది జాన్వీ. తన గ్లామరస్ ఫొటోలు, వీడియోలను ఎప్పటికప్పుడు ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేస్తూ ఫాలోవర్లను పెంచుకుంటోంది. తాజాగా మరికొన్ని అందమైన ఫొటోలను షేర్ చేసింది జాన్వీ. ఈ ఫొటోల్లో లైట్ ఎల్లో కలర్ క్రాప్ ట్యాంక్ టాప్, దానికి పర్ఫెక్ట్ మ్యాచ్ అయ్యేలా ఎమరాల్డ్ గ్రీన్ కలర్ జోగర్ ప్యాంట్స్ ధరించి ట్రెండీగా మెరిసిపోయింది జాన్వీ. మరీ ముఖ్యంగా ఆమె టాప్ పై ఉన్న 'అవుట్ ఆఫ్ మై మైండ్ ప్లీజ్ లీవ్ ఎ మెసేజ్' అనే స్లోగన్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం జాన్వీ ఫొటోస్ నెట్టింట వైరల్‌గా మారాయి. వీటిని చూసిన నెటిజన్లు జాన్వీ లుక్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. చాలా నేచురల్‌గా, హీరోయిన్ మెటీరియల్‌లా ఉందంటూ కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. కాగా గతంలోనే ఓ సినిమాలో నటించింది జాన్వీ. సందీప్ కిషన్ హీరోగా నటించిన 'మనసుకు నచ్చింది' అనే సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా చిన్న పాత్రలో మెరిసింది జాన్వీ.





# బర్త్ డే వేళ ఐసీసీ బంపర్ గిఫ్ట్.. ఈ ఘనత సాధించిన 12వ భారతీయ క్రికెటర్‌గా గంగూలీ రికార్డు

54వ పుట్టినరోజు సందర్భంగా సౌరవ్ గంగూలీకి ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్ గౌరవం దక్కింది. ఈ ఘనత అందుకున్న 12వ భారతీయ క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన గంగూలీ, భారత క్రికెట్‌కు చేసిన సేవలకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు. భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన కెప్టెన్లలో ఒకరైన సౌరవ్ గంగూలీ బుధవారం (జూలై 8) తన 54వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన రోజున ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు, మాజీ క్రికెటర్లు సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే, ఈ శుభసందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మారుస్తూ ఐసీసీ సౌరవ్ గంగూలీకి ప్రపంచ క్రికెట్‌లోనే అత్యున్నతమైన గౌరవాన్ని ప్రకటించింది. మీడియా నివేదికల ప్రకారం.. గంగూలీ సాధించిన చారిత్రాత్మక విజయాలు, అద్భుతమైన కెరీర్‌ను గుర్తిస్తూ ఐసీసీ తన ప్రతిష్టాత్మక హాల్ ఆఫ్ ఫేమ్ క్లబ్‌లోకి ఆయనను ఆహ్వానించింది. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకోవడం ద్వారా సౌరవ్ గంగూలీ ఈ అత్యున్నత క్లబ్‌లో చేరిన 12వ భారతీయ క్రికెటర్‌గా సరికొత్త రికార్డు సృష్టించారు. ఒకవేళ కేవలం పురుషుల క్రికెటర్ల జాబితాను మాత్రమే తీసుకుంటే, ఈ ఘనత సాధించిన దేశపు 10వ పురుష ఆటగాడిగా ఆయన నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి ఇన్నేళ్లు గడుస్తున్నా.. 'ప్రిన్స్ ఆఫ్ కోల్‌కతా'కు దక్కిన ఈ అరుదైన పురస్కారం, ప్రపంచ క్రికెట్‌లో ఆయన వేసిన ముద్ర ఎంత బలమైనదో మరోసారి నిరూపించింది. సౌరవ్ గంగూలీ కేవలం తన విజయాల రికార్డుల కోసం మాత్రమే కాకుండా, భారత క్రికెట్ మైండ్‌సెట్, డీఎన్ఏ మార్చేసిన గొప్ప నాయకుడిగా ఎప్పటికీ గుర్తుండిపోతారు. 90వ దశకంలో భారత జట్టు స్వదేశంలో మాత్రమే పులులులా గర్జిస్తూ, విదేశీ పిచ్‌లపై తరచూ చేతులెత్తేసేది. కానీ, గంగూలీ జట్టు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ బలహీనమైన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేశారు. విదేశీ గడ్డపై కూడా ప్రత్యర్థి కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తూ మ్యాచ్‌లు గెలవవచ్చనే బలమైన నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఆయన జట్టుతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులలో నూరిపోశారు.




ఒక అద్భుతమైన కెప్టెన్‌గానే కాకుండా.. యువ ఆటగాళ్లలోని ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించడంలో గంగూలీకి సాటి ఎవరూ లేరు. భారత క్రికెట్‌ను సుదీర్ఘకాలం పాటు శాసించిన మహేంద్ర సింగ్ ధోనీ, యువరాజ్ సింగ్, జహీర్ ఖాన్, వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్, ఆశిష్ నెహ్రా వంటి మేటి ఆటగాళ్లు కెరీర్ ప్రారంభంలో ఇబ్బంది పడుతున్నప్పుడు గంగూలీ వారికి అండగా నిలబడి పూర్తి మద్దతు ఇచ్చారు. ఆయన నమ్మకాన్ని నిలబెడుతూ ఆ యంగ్ ప్లేయర్స్ తర్వాతి కాలంలో ప్రపంచ ఛాంపియన్లుగా ఎదిగారు. సౌరవ్ గంగూలీ కేవలం 20 ఏళ్ల వయసులోనే టీమిండియా తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేసి, సుమారు 16 సంవత్సరాల పాటు దేశానికి అద్భుతమైన సేవలు అందించారు. 2008లో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పే సమయానికి ఆయన బ్యాటింగ్‌లో ఎన్నో అసాధారణ రికార్డులను సృష్టించారు. తన అంతర్జాతీయ కెరీర్‌లో మొత్తం 18,575 పరుగులు సాధించగా.. అందులో వన్డే ఫార్మాట్‌లో 11,363 పరుగులు, టెస్ట్ ఫార్మాట్‌లో 7,212 పరుగులు ఉన్నాయి. కెప్టెన్‌గా 49 టెస్ట్ మ్యాచ్‌లకు నాయకత్వం వహించి 21 విజయాలు, 146 వన్డే మ్యాచ్‌లలో 76 విజయాలను ఖాతాలో వేసుకున్నారు. క్రికెట్ మైదానానికి దూరమైనప్పటికీ, తర్వాతి కాలంలో బీసీసీఐ అధ్యక్షుడిగా, ఇతర పరిపాలనా బాధ్యతల ద్వారా ఆయన ఎప్పుడూ ఈ ఆటతోనే ముడిపడి ఉన్నారు.

# తిలక్ వర్మపై బీసీసీఐ వేటు? గతంలో గిల్‌కు జరిగినట్లే ఇప్పుడు తిలక్‌కూ తప్పదా ?



టీమిండియా టీ20 జట్టులో కీలక మార్పులపై ప్రశ్నలు మొదలయ్యాయి. వైస్ కెప్టెన్ తిలక్ వర్మ పేలవ ఫామ్, బ్యాటింగ్ వైఫల్యంతో విమర్శలు ఎదుర్కొంటున్నారు. గతంలో శుభ్‌మన్ గిల్ ఎదుర్కొన్న పరిస్థితుల మాదిరిగానే తిలక్ భవిష్యత్తుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భారత క్రికెట్లో ప్రస్తుతం ఒక పెద్ద కుదుపు చోటుచేసుకుంది. కొన్నాళ్ల క్రితమే ఘనంగా టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా.. ఇప్పుడు అదే ఫార్మాట్‌లో చాలా బలహీనంగా కనిపిస్తోంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఐర్లాండ్ చేతిలో ఫస్ట్ టైం టీ20 సిరీస్‌ను కోల్పోయిన భారత్, ఇప్పుడు ఇంగ్లండ్‌తో జరుగుతున్న సిరీస్‌లోనూ ఆశలను వదిలేసుకుంది. దీంతో కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్లతో పాటు జట్టులోని పలువురు ఆటగాళ్లు విమర్శల పాలవుతున్నారు. ఇప్పటికే సంజూ శాంసన్‌ను జట్టు నుంచి తొలగించగా, ఇప్పుడు అందరి దృష్టి వైస్ కెప్టెన్ అయిన తిలక్ వర్మపై పడింది. అతని పేలవ ఫాం చూస్తుంటే.. గతంలో శుభ్‌మన్ గిల్‌ను జట్టు నుంచి డ్రాప్ చేయించినట్లే, ఇప్పుడు తిలక్ వర్మను కూడా బీసీసీఐ పక్కన పెట్టబోతుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. టీమిండియా ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత మళ్లీ ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడటానికి సుమారు మూడున్నర నెలల సమయం పట్టింది. ఈ లోపే టీమిండియాలో సమూల మార్పులు జరిగాయి. అంతవరకు టీంను నడిపించిన సూర్యకుమార్ యాదవ్‌ను కప్ గెలిచిన వెంటనే కెప్టెన్సీ నుంచి మాత్రమే కాకుండా ఏకంగా జట్టు నుంచి తొలగించారు. తన స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. మరోవైపు వరల్డ్ కప్ లో వైస్ కెప్టెన్‌గా ఉన్న సీనియర్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ నుంచి ఆ బాధ్యతలను లాక్కొని, యువ ఆటగాడు తిలక్?ను కొత్త వైస్ కెప్టెన్‌గా నియమించారు. అయితే ఈ రెండు నిర్ణయాలు కూడా ఇప్పటివరకు ఆశించిన రిజల్ట్స్ ఇవ్వకపోగా జట్టుకు మరిన్ని కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. సెలెక్టర్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పై దీర్ఘకాలిక ప్రణాళికలతో ఉన్నందున తనుకు మరికొన్ని సిరీసులలో అవకాశాలు ఇచ్చే ఛాన్స్ ఉంది. కానీ వైస్ కెప్టెన్ తిలక్ వర్మకు ఆ ఛాన్స్ దక్కుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఐపీఎల్ అయిపోయినప్పటి నుంచి తిలక్ ప్రదర్శన గ్రాఫ్ క్రమంగా పడిపోతూ వస్తోంది. జట్టుకు అవసరమైన వేగంతో తను రుగులు చేయలేకపోతున్నాడు. దీనికి తోడు జట్టులో అతని బ్యాటింగ్ పొజిషన్ మారడం కూడా ఒక సమస్యగా మారింది. కొన్ని నెలల క్రితం వరకు టాప్ ఆర్డర్‌లో 3 లేదా నాలుగో స్థానంలో ఆడిన తిలక్.. ఈషాన్ కిషన్ రీఎంట్రీతో ఇప్పుడు 5 లేదా 6వ స్థానంలో బ్యాటింగ్‌కు రావాల్సి వస్తోంది. ఈ కొత్త రోల్‌లో తిలక్ పూర్తిగా ఇరుక్కుపోయాడు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తను పడుతున్న ఇబ్బందులు టీంను కలవరపెడుతున్నాయి. తిలక్ వర్మ గణాంకాలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఇంగ్లండ్‌తో జరిగిన గత 3 ఇన్నింగ్స్‌లలో కలిపి అతను కేవలం 114 స్ట్రైక్ రేట్‌తో కేవలం 40 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అంతకుముందు ఐర్లాండ్ పర్యటనలో ఒక మ్యాచులో 74 పరుగులు చేసినప్పటికీ, అక్కడ కూడా అతని స్ట్రైక్ రేట్ కేవలం 100గానే ఉంది. ఆధునిక టీ20 క్రికెట్‌లో ఇంత తక్కువ స్ట్రైక్ రేట్‌తో ఆడటం టీం విజయాల మీద తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ కారణంగానే ప్లేయింగ్ 11లో తిలక్ వర్మ స్థానంపై మాజీలతో పాటు ఫ్యాన్స్ కూడా తీవ్రంగా ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ప్రస్తుత తిలక్ పరిస్థితిని చూస్తుంటే గతేడాది గిల్‌కు జరిగిన సీన్ గుర్తుకొస్తోంది. గిల్‌ను కూడా పెద్ద నమ్మకంతో టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా నియమించారు. కానీ ఆ తర్వాత జరిగిన ఆసియా కప్, ఆస్ట్రేలియా పర్యటన, సౌతాఫ్రికా సిరీస్‌లలో అతని బ్యాట్ పనిచేయలేదు. వైస్ కెప్టెన్‌గా ఉంటూ ఫాం కోల్పోవడంతో అతనిపై భారీ ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు టీ20 ప్రపంచకప్‌నకు సరిగ్గా ముందే బీసీసీఐ అతని మీద వేటు వేసి జట్టు నుంచి తొలగించింది. ఇప్పుడు సరిగ్గా అదే పరిస్థితి తిలక్ వర్మకు కూడా ఎదురు అవుతోంది. వైస్ కెప్టెన్ హోదాలో ఉండి కూడా జట్టుకు భారంగా మారుతున్న తిలక్ వర్మ విషయంలో బీసీసీఐ తదుపరి ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకుంటుందోనని క్రికెట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com